జీవనోపాధులు
... భవితవ్యం

సెప్టెంబర్ 2016

# స్వయం ఉపాధి



అసంఘటితమే కానీ ఔత్సాహికత ప్రభావం - 7

*ఉపాధ్యాయ దినోత్సవం! ఇంజనీర్ల దినోత్సవం!*

*శ్రీకృష్ణ జన్మాష్టమి! వినాయక చవితి! బక్రీద్! ఈద్ ముబారక్!*

*ఒలెంపిక్స్ – సింధు, సాక్షి, దీపాలకు శుభాకాంక్షలు! పారా ఒలెంపిక్స్ – దేవేంద్ర, తంగవేలు, దీపా, వరుణ్‌లకు శుభాకాంక్షలు!*

భారతదేశం ప్రధానంగా శ్రమ మీద ఆధారపడిన దేశం. దేశంలోని 80 శాతానికి పైగా కుటుంబాలు స్వయం ఉపాధి మీద లేదా కుటుంబం నిర్వహించే పరిశ్రమల్లో భాగంగా లేదా 2–3 వ్యక్తులు పని చేస్తున్న సంస్థలలో భాగంగా ఉంటారు. కొంత మంది కుటుంబం నిర్వహించే సంస్థలతో లేదా కుటుంబంలోనే నిర్వహించే సంస్థలలో పని చేస్తారు. కొంతమంది తమ విద్య పూర్తయిన తర్వాత కానీ, స్కూల్ నుంచి డ్రాపౌట్ అయ్యాక కానీ ఆ పని చేస్తారు. ఆమె/అతను స్వయం ఉపాధి చేపట్టిన ఎవరైనా తెలిసిన వ్యక్తి వద్దకు వెళ్లి వారి వద్ద అప్రెంటీస్‌గా చేరతారు.

అక్కడ వారు కూడా స్వతంత్రంగా ఎదుగుతారు. ఒక లారీ క్లీనర్, డ్రైవర్ కావచ్చు. ఒక ఫ్యాక్టరీలో పనివాడిగా చేరి ఆ తర్వాత స్వతంత్రంగా మారవచ్చు. ఒక లారీ డ్రైవర్ క్రమంగా దాని యజమాని కావచ్చు. అతను సొంతంగా ఏదైనా శిక్షణా సంస్థలో లేదా స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో/నైపుణ్యాభివృద్ధి సంస్థలో శిక్షణ పొందవచ్చు. తాను ఇతర వనరుల నుంచి పొందిన పెట్టుబడికి అదనంగా బ్యాంకుల నుంచి రుణాన్ని పొందవచ్చు. అలాంటి వారికి ప్రభుత్వం సబ్సిడీ అందించి సహకరించవచ్చు. ఏంజెల్ ఇన్వెస్టర్లు సహకరించవచ్చు. మైక్రో వెంచర్ క్యాపిటలిస్టులు కూడా కొంత ఈక్విటీ తీసుకోవచ్చు. ఒకే రకంగా స్వయం ఉపాధి చేపట్టిన వారంతా కలిసి సమిష్టిగా ఏర్పడవచ్చు. వారి మధ్య నైపుణ్యాలు, పరికరాలు, నాణ్యత, అకౌంటింగ్, వర్కింగ్ క్యాపిటల్, స్టోరేజ్, మార్కెటింగ్, మార్కెట్‌లో ధరలు మొదలైన వాటిపై భేదాభిప్రాయాలు ఉండవచ్చు. సంస్థకు గుర్తింపు ఎలా అనే సమస్య ఉండవచ్చు. లైసెన్సులు, చట్టపరమైన ఏర్పాట్ల వల్ల సమస్యలు ఉత్పన్నం కావచ్చు. వీరిలో చాలా మంది అసంఘటిత రంగంలో ఉన్నారు. వారిలో మరికొంత మంది చాలా తక్కువగా సంఘటితమై ఉండవచ్చు. ఈ నేపథ్యంలో 'జీవనోపాధులు' 'స్వయం ఉపాధి'ని పరిశీలించింది.

దయచేసి జాన్ స్టూవర్ట్ మిల్ రచించిన, 'ఆన్ లిబర్టీ'ని చదవండి. దానిని విస్మరించలేం.

ఎప్పటిలాగే ఈ–లింక్స్‌లో విలువగొలుసు – 'వీసీఏ ఆఫ్ వీట్ అండ్ రైస్ ఇన్ యూపీ, ఇండియా'; ఉపరంగం – 'ద ఫిషరీస్ సబ్ సెక్టార్, టాంజానియా'; ఈ – బుక్ – 'ద ఛాలెంజ్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ఇన్ ఇండియా, యాన్ ఇన్‌ఫార్మల్ ఎకానమీ పెర్‌స్పెక్టివ్'; వీ బుక్ – 'గారో హిల్స్ – పీపుల్ అండ్ రూరల్ విలేజ్ లైఫ్ – మేఘాలయ ఇండియా 2016' లను ఇవ్వడం జరిగింది.

ఈ నెల అనుబంధాలుగా – బృహత్ ప్రయత్నం కింద 'సేంద్రీయ వ్యవసాయం'; క్షేత్రం – 'ఛోటా నాగ్‌పూర్ పీఠభూమి'; జీవనోపాధి నిర్వహణ నోట్స్ కింద 'టూల్స్' ఇవ్వడం జరిగింది.

ఈ సంచిక చదవడం మీకు ఉపయుక్తంగా ఉంటుందని విశ్వసిస్తూ...

మీ 'జీవనోపాధులు' బృందం

**ప్రజల ఉద్యోగాల మార్పుల వల్ల 36% పైగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇంకా పేదరికంలో జీవిస్తున్నారు. వారి దినసరి ఆదాయం 3.10 డాలర్ల కంటే తక్కువగా ఉంది. అది వారి కొనుగోలు శక్తితుల్యత (PPP)పై ఆధారపడిఉంది. ప్రపంచ వ్యాప్తంగా, 2030 కల్లా పేదరిక నిర్మూలనకు సం॥రానికి 600 బిలియన్ల డాలర్లు లేదా 15 సం॥రాలకు 10 ట్రిలియన్ల డాలర్లు అవసరం అవుతుందని నివేదిక లెక్కించింది.**

**(మూలం: వరల్డ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ సోషల్ ఔట్‌లుక్–2016)**




**బహుళ వ్యూహాలు ఆశించిన ఫలితాలకు హామినిస్తాయి.**

**ఈ నెల జీవనోపాధులు, అనుబంధాలు మరియు ఈ–కోర్సు**












జీవనోపాధులు ... భవితవ్యం

ఎడిటర్ ఇన్ చీఫ్ : జి. మురళీధర్
సీనియర్ ఎడిటర్ : టి. వెంకటేశ్వర్లు
వర్కింగ్ ఎడిటర్ : యస్.లక్ష్మణ్
సంపాదక సాహచర్యం : వి. అరవింద్
: కె. ఛాయా దేవి
: కె. రమేష్

**మాతో/మాదారిలో**

ఎ. ఉమ, వి. మురళీధర్, జి. జానకి, టి. నిర్మల, జి. దయానంద్, సి. రమేష్, వి. దీప్తి, ఎం. రవికృష్ణ, కె. భారతి, జి. రవిందర్, బి. మధుసూదన్, ఎం. లావణ్య, పి. మధుసూదన్, ఎ. వెంకట రమణ, కె. మంజుల, కె. శ్రీదేవి, కె. కృష్ణ చైతన్య, ఎం. సుగుణశ్రీ

**ప్రైవేట్ సర్క్యులేషన్ కోసం మాత్రమే**

**అక్షర లైవ్లీహుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ALPL)**

**సహకారంతో**

Contact:
Mobile: 9885499297
web: www.aksharakriti.org,
www.livelihoods.net.in
e-mail: akshara@aksharakriti.org,
jeevanopadhulu@gmail.com

**చిరునామా**
C/o. Akshara Network
for Development Support Services
HIG - II, B-12, F - 1, APHB కాలనీ
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 044

## ఈ సంచికలో...

**ప్రత్యేకం**

**ఫోకస్: స్వయం ఉపాధి** 11

సందర్భం - బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) చట్టం 18

నెలనెలా..

సంపాదకీయం 2

స్పందన మరియు న్యూస్ 4

జాతీయ వార్తలు 5

క్షేత్రం - **దాద్రా & నగర్ హవేలి** 6

సుక్షేత్రం - **అసుర గిరిజన తెగ**

మథనం - **అసంఘటితమే కానీ ఔత్సాహికత ప్రభావం** 7

సంభాషణ - **ఆమ్‌ఆద్మీ, నిస్సహాయులు, కమ్యూనిటీ లీడర్, క్షేత్రస్థాయి కార్యకర్త** 8

అభివృద్ధి కార్యకర్త సంభాషణ 10

అభివృద్ధి సంస్థ - **భారతమాత వృద్ధుల సమాఖ్య, లోహార్‌దగ గ్రామ్ స్వరాజ్ సంస్థాన్** 18

జీవన తంత్రం - **లక్ష్యసిద్ధి** 21

పుస్తకాలు - క్లాసిక్ పుస్తకం : **ఆన్ లిబర్టీ** 22

లేటెస్ట్ పుస్తకం : **సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్**

లేటెస్ట్ పుస్తకం : **ద రీ ఎమెర్జెన్సీ ఆఫ్ సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్**

'యోగ'క్షేమం 23

**ఈ-వనరులు:** 22
**విలువ గొలుసు విశ్లేషణ** : VCA ఆఫ్ వీట్ & రైస్ ఇన్ ఉత్తర్ ప్రదేశ్, ఇండియ
**ఉపరంగం** : ది కేస్ స్టడీస్ ఆఫ్ ఫిషరీస్ సబ్ సెక్టార్ ఇన్ టాంజానియా
**పుస్తకం** : ది ఛాలెంజ్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ ఇండియా యాన్ ఇన్ఫార్మల్ ఎకానమీ పర్‌స్పెక్టివ్
**వీడియో** : గారో హిల్స్ - పీపుల్ అండ్ రూరల్ విలేజ్

బృహత్ ప్రయత్నం : సేంద్రీయ వ్యవసాయం
క్షేత్రం : ఛోటా నాగ్‌పూర్ పీఠభూమి
లైవ్లీహుడ్ మేనేజ్‌మెంట్ నోట్స్ : టూల్స్

ఈ-లైవ్లీహుడ్స్ లెర్నింగ్ కోర్స్ : క్యాప్సుల్ నెం: **353 - 368**

గమనిక: ఇందులో ప్రచురించిన రచనల్లోని అభిప్రాయాలు ఆయా రచయితలవి. వాటిని పత్రిక అభిప్రాయాలుగా భావించకూడదు.

# స్పందన




ఆగస్టు జీవనోపాధుల పత్రికలో 'పాఠశాల తర్వాత కెరీర్' అనే సంచిక చాలా బాగుంది. మీ బృందానికి ధన్యవాదములు.

ఆసరా రాజేష్
హైదరాబాద్

గమనిక: స్థానిక సందర్భానుసారంగా మా పత్రికను అందించాల్సిందిగా కోరుతున్నాము. అందువలన, మా అంతట మేము తెలుగు చేసి అందించే ప్రయత్నం, అక్టోబర్ 2016 నుండి నిలిపివేస్తున్నాము. ఆసక్తి ఉన్న మిత్రులు మమ్ములను సంప్రదించగలరు.



'స్వదేశీ దర్శన్' పథకం ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించగలదా?

## ➤➤ న్యూస్ ➤➤

**✠ భారీ వర్షాల కారణంగా 26 వేల ఎకరాల్లో పంట నష్టం:**

భారీ వర్షాల కారణంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 26,312 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఆదిలాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, కరీంనగర్, జిల్లాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖ కార్యదర్శి తెలిపారు. 5,000 ఎకరాల్లో పత్తి, 8,365 ఎకరాల్లో కంది, 4,000 ఎకరాల్లో జొన్న పంట, 2,400 ఎకరాల్లో వరి, 4,500 ఎకరాల్లో మొక్క జొన్న పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పలుచోట్ల సోయాబీన్, వేరుశనగ, మినుము పంటలు కూడా దెబ్బతిన్నాయని తెలిపారు.

**✠ అన్నదాతకు అందుబాటులో గోదాములు:**

తెలంగాణ వ్యవసాయ మార్కెట్లకు అన్నదాతకు వచ్చే నెల ప్రారంభమవుతున్న కొత్త మార్కెటింగ్ సంవత్సరం (2016-17)లో గోదాములు అందు బాటులోకి వస్తున్నాయి. రాష్ట్రంలో ఏడాదిలో భారీస్థాయిలో 17.07 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యమున్న 330 కొత్త గోదాములను రూ.1024 కోట్ల వ్యయంతో వ్యవసాయ మార్కెట్లలో నిర్మిస్తున్నారు. వీటిలో ఇప్పటికే 101 గోదాముల నిర్మాణాలు పూర్తి కావడంతో మార్కెట్ కమిటీలకు అప్పగించారు. వచ్చే డిసెంబర్‌కల్లా మిగతా వాటినీ పూర్తిచేయాలని శాఖ గడువును నిర్దేశించారు.

**✠ 15 నెలల్లో భగీరథ:**

వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి తెలంగాణలోని అన్ని గ్రామాలకు మంచినీరు చేరేలా మిషన్ భగీరథ పనులు జరగాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను, అంతర్గత పైపులైన్లు, ఇంటింటికీ నల్లాలను బిగించే పనులు ప్రతిగ్రామాల్లో పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత పనుల వేగంపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

**✠ రేషన్ కిరోసిన్ ధరను రూ.2లు పెంచిన తెలంగాణ ప్రభుత్వం:**

తెలంగాణలో ఆహార భద్రత పథకం కింద రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే కిరోసిన్ ధరను లీటర్‌కు రూ.2లు పెంచుతూ ప్రభుత్వం అంతర్గత సర్క్యులర్ జారీ చేసినట్లు తెలుస్తుంది.

**✠ 'ఉపాధి' టెక్నాలజీ అమలు భేష్:**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో నిలిచాయి.

**✠ వ్యవసాయంలో డ్రోన్‌ల**

వ్యవసాయం, అనుబంధ రంగాల్లో రైతులకు మరింత ప్రయోజన చేకూర్చేలా డ్రోన్‌లు, నిఘా కెమెరాలను విరివిగా ఉపయోగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. వీటి ద్వారా సకాలంలో అవసరమైన చర్యలు చేపట్టి పంటలను కాపాడాలని నిర్ణయించింది.

**✠ మహిళలకు ఏపీ సిఎం కానుక 'MMHC 35+':**

ఆంధ్రప్రదేశ్‌లోని మహిళలకు ముఖ్యమంత్రి మరో కానుకను ప్రకటించారు. మహిళా మాస్టర్ హెల్త్ చెకప్ (MMHC) పేరిట 35 సం॥రాలు దాటిన మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు చేసే పథకాన్ని ప్రారంభించారు. మహిళలకు ఖరీదైన గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, హార్మోన్ల పరీక్షలతో పాటు సాధారణ బీపీ, మధుమేహ పరీక్షలను ఉచితంగా జరిపిస్తామని తెలిపారు. 35 ఏళ్ళ నిండిన ప్రతి మహిళా ఈ పరీక్షలను తప్పనిసరిగా చేయించు కోవడం ద్వారా రాబోయే అనారోగ్య సమస్యలను ముందే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు.

**✠ ఏపీలో 100 శాతం విద్యుదీకరణ:**

దేశంలో పూర్తి విద్యుదీకరణ జరిగిన రెండో రాష్ట్రంగా గుజరాత్ రాష్ట్రం తరువాత స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ దక్కించుకుంది.

(మూలం: ఈనాడు, సాక్షి, నమస్తే తెలంగాణ) ✸

# జాతీయ వార్తలు

**✠ ఖరీఫ్‌లో రికార్డు స్థాయి దిగుబడి – ముందస్తు అంచనాలను విడుదల చేసిన కేంద్రం:**

ఖరీఫ్‌లో ఈ ఏడాది ఆహారధాన్యాల దిగుబడి రికార్డు స్థాయిలో 135.03 మిలియన్ టన్నులకు చేరుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఇది గతేడాది కంటే 11.02 మిలియన్ టన్నుల అధికమని వెల్లడించింది. 2016-17 ఖరీఫ్ సీజన్ తొలి ముందస్తు అంచనాలను కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి విడుదల చేశారు. ఈ ఖరీఫ్‌లో 93.98 మిలియన్ టన్నుల దిగుబడితో వరి రికార్డు సృష్టించబోతోందని వ్యవసాయశాఖ తెలిపింది. ఆహార ధాన్యాలు గత ఐదేళ్ళ సగటు దిగుబడి 127.38 మిలియన్ టన్నులతో పోల్చినా సరే ఈసారి 7.65 మిలియన్ టన్నుల మేర ఉత్పత్తి పెరగబోతున్నట్లు కేంద్రం వెల్లడించింది. సగటున అన్ని ప్రాంతాల్లో వర్షం బాగా కురవడంతో ఖరీఫ్ దిగుబడులు అంచనాలను మించుతున్నట్లు పేర్కొంది.

**✠ భారత్‌లో అధ్వాన్నంగా ఆరోగ్యం:**

ప్రపంచ ఆరోగ్య సూచీలో మరోసారి వెనుకబడిపోయింది. 188 దేశాల్లో భారత్ 143వ స్థానాన్ని మాత్రమే దక్కించుకుంది. చిన్న దేశాలతో పోల్చుకున్న భారత్ వెనుకబడి ఉండటం కాస్త విచారించాల్సిన విషయమే. భారత్ అభివృద్ధి విషయంలో దూసుకుపోతున్న ఆరోగ్య రంగంలో మాత్రం అంత చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించలేదని అధ్యయన సంస్థ పేర్కొంది. అంతకు ముందు విద్యపరమైన జాబితాలో కూడా భారత్ చివరి స్థానాల్లోనే చోటు సంపాదించుకుంది. కానీ, పొరుగుదేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో పోలిస్తే మాత్రం భారత్ పరిస్థితి కొంత మెరుగుగా ఉందని ఆ అధ్యయనం చెప్పింది. ఆరోగ్య రంగంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై తొలి వార్షిక అంచనాలు లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా ఈ నివేదికను విడుదల చేశారు. మలేరియా విషయంలో పది పాయింట్లు దక్కిన ఇప్పటికీ ప్రమాదకరమైన జోన్‌లోనే ఇంకా భారత్ ఉండిపోయింది. అలాగే, పరిశుభ్రతలో ఎనిమిది పాయింట్లే దక్కాయి. ఐదేళ్ళలోపు మరణాల విషయంలో 39 పాయింట్లు, ప్రసూతి మరణాల నియంత్రణలో 28 పాయింట్లు మాత్రమే భారత్‌కు లభించాయి. వాతావరణ కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఎక్కువగా కృషిచేసినందుకు 80 పాయింట్లు దక్కాయి. ఇలా చేయడం ద్వారా స్థూలకాయం సమస్య రాకుండా నివారించగలిగినట్లు తెలిపారు.

**✠ ఇక నేరుగా రైతు ఖాతాలోకి సబ్సిడీ:**

వ్యవసాయ రంగంలో సరికొత్త సంస్కరణలకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇక మీదట ఎరువులపై ఇచ్చే సబ్సిడీ పక్కదారి పట్టకుండా కళ్ళెం వేసేందుకు ఎరువుల పంపిణీని 'నగదు బదిలీ' పథకం కిందకు తీసుకు రావాలని నిర్ణయించింది. ఎరువుల వాడకంలో దీంతోపాటు ఇక మీదట భూసార పరీక్షల నివేదికల ఆధారంగానే ఎరువులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. విచ్చలవిడితనాన్ని కూడా అరికట్టనుంది. వీటికి అందించే సబ్సిడీని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా 16 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఎరువులకూ నగదు బదిలీ అమలు చేయాలని నిర్ణయించింది.

**✠ పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా కేంద్రం మరో అడుగు:**

పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా కేంద్రం మరో అడుగు వేసింది. దేశంలోని పేద ప్రజలు తక్కువ వడ్డీ రుణాలు ఇచ్చేందుకు కేంద్ర సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్రం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా లబ్ధిదారుడికి రూ.70వేల రుణసహాయం అందనుంది. ఈ అంశంపై కేంద్రం దేశంలోని బ్యాంకుల ద్వారా చర్చలు జరుపుతుంది. రానున్న 30 రోజుల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని ప్రధాని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

**✠ ఆహార శుద్ధి రంగంలో కొత్త పథకం:**

వ్యవసాయ, అనుబంధ రంగాలలో ఆదాయం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మరో కొత్త పథకానికి రూపకల్పన చేస్తోంది. ఆహార శుద్ధి పరిశ్రమల సామర్థ్యాలను పెంచడంతో పాటు, సంబంధిత పరిశ్రమలను విస్తరించడానికి ఈ పథకం కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ఈ పథకానికి సంబంధించిన కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమలశాఖ ముసాయిదా రూపొందించింది. ఈ పథకం కింద ఒక్కో ఆహార శుద్ధి పరిశ్రమకు రూ.5 కోట్ల దాకా ఆర్థిక సాయం అందిస్తారు. దీనికి సంబంధించిన విధివిధానాలను ముసాయిదాలో పేర్కొన్నారు.

**✠ గ్రామీణ పారిశుద్ధ్యంలో 'సిక్కిం'కు అగ్రస్థానం:**

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై జాతీయ శాంపిల్ సర్వే నిర్వహించిన సర్వేలో స్వచ్ఛ రాష్ట్రంగా సిక్కిం మొదటి స్థానంలో నిలిచింది. 2015 మే – జూన్ మధ్య 26 రాష్ట్రాలల్లోని 3,778 గ్రామాల్లో 73,716 నివాసాల్లో ఈ సర్వే నిర్వహించారు. మరుగుదొడ్లను కలిగి ఉన్న ఇండ్ల శాతం, వాటి వినియోగం ఆధారంగా ఈ ర్యాంకులను ఖరారు చేశారు. ఈ సర్వే నివేదికను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఢిల్లీలో విడుదల చేశారు. ఈ నివేదికలో 98.2 శాతంలో సిక్కిం మొదటి స్థానంలో నిలవగా, చివరి స్థానంలో జార్ఖండ్ నిలిచింది. గుజరాత్ 14వ స్థానంలో నిలువగా, ఆంధ్రప్రదేశ్ 16వ స్థానంలో నిలిచింది. మరోవైపు కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ పారిశుద్ధ్య పరిస్థితిపై సేకరించిన వివరాలతో క్రోడీకరించిన నివేదికలోనూ సిక్కిం (99.1%) అగ్రస్థానంలో నిలవగా, బీహార్ చివరి స్థానంలో నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో హిమాచల్ ప్రదేశ్ (97.11), కేరళ (96.35) నిలవగా, గుజరాత్ మొదటి పదింట్లో స్థానం దక్కించుకుంది. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్లల్లో మరుగుదొడ్లు కలిగి, వాటిని వాడుతున్న వారి శాతం 42.13గా ఉన్నట్లు మంత్రిత్వశాఖ తన నివేదికలో పేర్కొంది.

**✠ రూ.42 వేల కోట్లు మార్కు దాటిన 'జన్‌ధనం':**

ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాల్లో డిపాజిట్లు రూ.42 కోట్ల మార్కును దాటాయి. కేంద్రం ఇచ్చిన తాజా వివరాల ప్రకారం ఏప్రిల్ నుంచి ఈ ఖాతాల్లో రూ. 6 వేల కోట్లు జమ అయ్యాయి. జన్‌ధన్ యోజన ఖాతాల్లో డబ్బుల జమ క్రమంగా పెరుగుతోందని అధికారులు తెలిపారు.

**✠ నంబర్‌వన్ 'స్వచ్ఛ మైసూరు':**

దేశవ్యాప్తంగా బహిరంగ మలవిసర్జనలేని నగరంగా 10 లక్షలు జనాభా ఉన్న మైసూరు నగరం ప్రథమస్థానంలో నిలిచింది. ఈ నెల 30న న్యూఢిల్లీలో నిర్వహించనున్న 'స్వచ్ఛ భారత్ శపథ్' కార్యక్రమంలో ప్రధాని చేతులమీదుగా అందుకోనున్నారు. కేంద్రపట్టణాభివృద్ధిశాఖ నుంచి 27న ధ్రువపత్రం అందుకోనున్నారు. దేశవ్యాప్తంగా 73 నగరాల్లో క్వాలిటీ ఆఫ్ ఇండియా చేపట్టిన సర్వేలో బహిరంగ మలవిసర్జనలేని మైసూరు ప్రథమస్థానంలో నిలిచింది.

(మూలం:ఈనాడు) ✸

## దాద్రా & నగర్ హవేలీ



దాద్రా & నగర్ హవేలీ కేంద్రపాలిత ప్రాంతం (UT) పశ్చిమ భారతదేశంలో ఉంటుంది. నగర్ హవేలీ మహారాష్ట్ర మరియు గుజరాత్ మధ్యభాగంలో ఉండి, దాద్రా భాగం గుజరాత్ రాష్ట్ర మధ్యభాగంలో వాయువ్యానికి కిలో మీటర్ దూరంలో ఉంటుంది.

ఈ రెండు ప్రాంతాలకు ఉమ్మడి రాజధాని సిల్వస్సా. ఇది 11 ఆగస్టు, 1961 నుండి ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయబడి, భారత ప్రభుత్వ పరిపాలన ద్వారా UTగా ఉంది. ఇది 4వ కేంద్రపాలిత ప్రాంతంగా, రాష్ట్రాలలో 32వ రాష్ట్రంగా కొనసాగుతుంది.

ఈ ప్రాంతం 491 కి॥మీలు భూభాగాన్ని కలిగి ఉంది. అందులో 43% భూమి అటవీ ప్రాంతానికి చెందినది. ఇక్కడ వార్షిక వర్షపాతం 2000 నుండి 2500 మి.మీ॥. దీని జనాభా 2011 జనాభా లెక్కల ప్రకారం 3,42,853 ఉంది. అందులో గిరిజనులు 60% మంది ఉన్నారు. ఈ ప్రాంత స్త్రీ-పురుషుల నిష్పత్తి 775:1000 ఉండగా, అక్షరాస్యత రేటు 77.65%గా ఉంది. ఈ ప్రాంతంలో గుజరాతీ, హిందీ, ఇంగ్లీష్ అధికార భాషలుగా ఉన్నప్పటికీ గుజరాతీ మరియు మరాఠీ-కొంకణీ భాషల్లోనే ప్రజలు ఎక్కువగా మాట్లాడతారు. ఈ ప్రాంతంలో ప్రజలు గుజరాతీయులతో పాటు మరాఠీలు, రాజస్థానీలు, బీహారీలు, తమిళులు, ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు మరియు వివిధ రాష్ట్రాల నుండి వలస వచ్చేవారున్నారు. ఇచ్చట హిందూ, క్రిస్టియన్లతో పాటు జైన్ మరియు ముస్లిం మతాల వారున్నారు.

ఈ UTలో తారకేశ్వర శివమందిరం, బింద్రాబిన్, ఖాన్‌వెల్ నందు జింకల పార్కు, వనగంగ సరస్సు, ఐలాండ్ గార్డెన్, వనవిహార్ విద్యాన్ మినీ జంతు ప్రదర్శనశాల, బాల్ ఉద్యానవనం, గిరిజనుల సంగ్రాహాలయం మరియు సిల్వస్సా నందు హిర్‌దావన్ గార్డెన్లు ఇక్కడి ముఖ్య పర్యాటక కేంద్రాలు.

ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి ప్రాథమిక జీవనాధారం వ్యవసాయం. దీనిపై సుమారు 60% ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. అలాగే 58,380 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నారు. ఆహార పంటలలో ముఖ్యంగా వరి, జొన్నలు, చిరుధాన్యాలు, చెఱుకు మరియు కందులు పండిస్తారు. కూరగాయాలలో టమాట, కాలిఫ్లవర్, క్యాబేజీ మరియు వంకాయ మొ.వి. అలాగే పండ్లల్లో మామిడి, సపోటా, జామ, కొబ్బరి మరియు అరటిని ఎక్కువగా పండిస్తారు.

ఈ ప్రాంత గిరిజనులు ఎక్కువగా అటవీ ఉత్పత్తులు సేకరిస్తారు. అవి: ఖైర్‌వుడ్, సాధారణ కలప, టేకు, సంద్ర, మహార మరియు సీసము వంటివి చెట్ల నుండి సేకరిస్తారు. మరియు పశుపోషణ చేయడం ద్వారా ఆదాయంను పొందుతున్నారు. వ్యవసాయం, పశుపోషణ మరియు అటవీ ఉత్పత్తుల సేకరణతో పాటు ఈ ప్రాంతంలో 2710 చిన్న, మధ్యతరహా మరియు భారీ పరిశ్రమలు కూడా ఉన్నాయి. పరిశ్రమల ద్వారా 46000 మంది ఉపాధిని పొందుతున్నారు. మరియు రబ్బరు వంటి అటవీ ఉత్పత్తిని ఎగుమతి కూడా చేస్తున్నారు.

కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖవారు ఈ ప్రాంత ప్రజలు జీవనోపాధులు మెరుగుపడి, గ్రామీణాభివృద్ధి జరిగి, తద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఉద్దేశ్యంతో వివిధ పేదరిక నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా MGNREGS ద్వారా ప్రజల జీవనోపాధికి భద్రత పెంచడంపై కృషిచేస్తున్నారు. ✸



## అసుర గిరిజన తెగ



అసుర్ గిరిజన తెగ జార్ఖండ్ రాష్ట్రంలోని లోహార్‌దగ, పాలముడ్, లతెహర్ జిల్లాల్లో ఉన్నారు. 1991 జనాభా లెక్కల ప్రకారం, వీరి జనాభా 10,721. అసుర్ గిరిజనులు 12 వంశాలుగా విడగొట్టబడి, ఒక్కో వంశానికి ఒక్కో పేరుతో అనగా జంతువులు, పక్షులు, ధాన్యపు గింజల పేర్లు పెట్టుకొని జీవిస్తున్నారు. ఈ తెగ మళ్ళీ 3 ఉపగిరిజన విభాగాలుగా విభజించబడింది. అవి: బిర్ అసుర్, బిరిజ అసుర్, అగారియా అసుర్. చివరగా బిరిజ అసుర్ తెగ ప్రత్యేక షెడ్యూల్డ్ తెగ క్రింద గుర్తించబడింది.

ఈ గిరిజనులకు ఔషధమొక్కలకు సంబంధించిన విషయ పరిజ్ఞానం బాగా ఉంటుంది. ఈ తెగ తమ వివాదాలను పరిష్కరించుకునేందుకు 'జాతిపంచ్' అను గిరిజన మండలిని ఏర్పాటు చేసుకొని, తద్వారా గిరిజనులు తమ సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. వీరు రాజ్‌పుత్, ఓరన్, కార్వర్, రాగూర్, ఘాసీల నుండి ఆహారం తీసుకుంటున్నారు. మరియు ముండా, కార్వార్, ఇతర గిరిజనులతో బంధుత్వ సంబంధాలను కలిగి ఉన్నారు.

వీరు అడవులలో చెట్లను తొలగించి, బురదమట్టితో ఇల్లులను నిర్మించు కోవటం, కఱ్ఱ దూలాలు, వరిగడ్డిని, పెంకుల సహాయంతో పైకప్పులను ఏర్పరచుకొని నివసిస్తున్నారు. వారి ఇళ్ళలో పశువులు, పక్షులు ఉండేందుకు ప్రత్యేక స్థలాన్ని ఏర్పరచారు. అదేవిధంగా ఆరాధించే దైవం కొరకు ప్రత్యేక స్థలాలను ఏర్పరచుకున్నారు. పురుషులు ధోవతి, స్త్రీలు లోహ, లోహేతర గాజులను ధరించి తమ సంప్రదాయాలను కాపాడుతున్నారు.

ఈ గిరిజనులు సర్వాత్మవాదం, ప్రకృతివాదం మరియు పూర్వీకులను పూజించటం వంటి విధానాలను పాటిస్తున్నారు. వీరికి బాణామతి/చేతబడి పట్ల నమ్మకం అధికంగా ఉంది. వీరి ప్రధానదైవం సింగ్‌బొంగా. ఇతర దైవాలైన ధరతి మాత, దురాయి, టూరిహుకిడ్‌లను పూజిస్తారు. వీరి ప్రధాన పండుగలు సార్హుల్, కర్మ, ధన్‌బుని, కడెట్ల, రాజ్‌కర్మ, దశరకారం మొ.వి.

వీరు వేటనే ప్రధానంగా నమ్ముకొని జీవిస్తున్నారు. కాలక్రమేణా అభివృద్ధి చెందిన కొంతమంది వ్యవసాయం చేయటం, తీరిక సమయాల్లో అప్పుడప్పుడు వేటాడతారు. మైదాన ప్రాంతాల నుండి వచ్చిన వారితో సంబంధాలను కలిగి, పరాయీకరణ భావన ఏర్పరచుకోవడం వల్ల సంప్రదాయవృత్తులను విడనాడుతున్నారు. తత్ఫలితంగా లోహ సంబంధ పనిముట్లతో పనిచేయడం తద్వారా తమకంటూ ప్రత్యేక గుర్తింపును చాటుకున్నారు. మహిళలు పొయ్యి/కొలిమిలకు సంబంధించిన పాటలు పాడటం వల్ల మంట ఏవిధంగా మండుతుందో చెప్పడం. దానివల్ల తమ పిల్లలకు ఆరోగ్యకరమైన పరిస్థితులు కలిగి ఉంటాయని వీరి నమ్మకం. అసురులు వేటాడటం ద్వారా ఆహారం సంపాదించే స్థితి నుండి మంచి ఆర్థిక స్థితిగతుల వైపు దృష్టి కేంద్రీకరించారు.

వీరు పలురకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. అవి: విద్య, వైద్య, రవాణా, త్రాగునీరు లేకపోవడం వంటివి. వీరు నివసిస్తున్న ప్రదేశాలలో బాక్సైట్ మైనింగ్ ఉండటం, వీరి వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం పొంచి ఉండటంవల్ల వీరు వలస వెళ్ళటం, స్థానభ్రంశం చెందటం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అదేగాకుండా మైనర్ బాలికల అక్రమ రవాణ వంటి సమస్యలు కూడా ఉన్నాయి.

అసురులు జార్ఖండ్ రాష్ట్రంలో ఆదిగమతెగగా ఉండటం మరియు అధిక జనాభాతో కలిగి ఉండటం వల్ల ప్రభుత్వం వారికి సరైన సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. ✸

# అసంఘటితమే కానీ ఔత్సాహికత ప్రభావం

*కృష్ణాష్టమి!*

*గణేశ్ చతుర్థి!*

*బక్రీద్!*

*ఇంజనీర్ల దినోత్సవం!*

*ఉపాధ్యాయ దినోత్సవం!*

జీఎస్టీపై క్రమంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. జీఎస్టీ సమాఖ్య ఉనికిలోకి వస్తోంది.

అసంస్థాగత విస్తరణ ఎందుకు సరైన విధానం కాదో వాసన్ హెల్త్ కేర్ చూపుతోంది.

మనం కమ్యూనిటీ అభివృద్ధి మార్గంలోకన్నా, కమ్యూనిటీ నిర్వహణ దారిలో వెళ్లాలా? లేదా ఆ రెండింటి సమ్మేళనం దారిలో వెళ్లాలా?

కమ్యూనిటీ నిర్వహణ అన్నది స్థానిక పరిసరాలలో ఇమిడి ఉంటుంది. అది వ్యక్తులకు సాధికారత చేకూరుస్తుంది. సంబంధాలను బలోపేతం చేస్తుంది. మార్పు కొరకు ఉపక్రమించేందుకు దోహదం చేస్తుంది. అది ఒక ఉద్యమం నిర్మితమయ్యేందుకు ఏకాభిప్రాయ సాధనకు దోహదపడుతుంది. అది ప్రజా చైతన్యాన్ని మించి, ఒక రాజకీయ ప్రక్రియకన్నా కొంచెం తక్కువగా ఉంటుంది. అతిక్రమణలు అడ్డుకోవడానికి మనం స్వయం సమృద్ధి కలిగిన సమాజాన్ని అభివృద్ధి చేయాలి. ప్రజలు తమంతట తామే విద్యను, ఆరోగ్య సంరక్షణను, ఇతర సంస్థలను నియంత్రించుకునేలా సిద్ధం చేయాలి. తమ విలువలను, భూమిని, సంస్కృతిని ఇతరులకు అమ్ముకోవడాన్ని నిరోధించాలి. అధికారాన్నికైవసం చేసుకోవడానికి స్థానిక ప్రజా నిర్వహణ అవసరం. దాన్ని అట్టిపెట్టుకోవడానికి స్థానిక ప్రజల అభివృద్ధి అవసరం. దేశంలోని స్వయం సహాయక ఉద్యమం ఈ దిశగా కొంత దోహద పడుతోంది.

దీనర్థం ఆ రెండింటి మధ్యా ఘర్షణ లేదని కాదు. సభ్యులు, లీడర్లు, క్యాడర్/యానిమేటర్లు, సిబ్బంది/ఫెసిలిటేటర్లు ఎలా పని చేయాలన్నదానిపై ఒక క్రమబద్ధమైన అధ్యయనం అవసరం. అభ్యాసాంశాలలో మనం ఎందుకు పేదలుగా ఉన్నాం, ఎందుకు దుర్బలంగా ఉన్నాం అన్నవి ఉండాలి. సంస్థలు ఎలా సహకరిస్తాయి, సంస్థలు ఎలా ఓపెన్–ఎండెడ్‌గా ఉండే వేదికలుగా ఉండవచ్చు, మొత్తం ప్రయత్నాన్ని స్థానిక ప్రజలు తమ హస్తగతం చేసుకోవడమనేది ముందుకు పోవడానికి ఎలా దోహదపడుతుంది అన్న అంశాలు దానిలో ఉండాలి. ఈ అధ్యయనంలో పాల్గొనే వారందరికీ తెలిసిన/జరగబోయే కార్యక్రమాలపై మొదటి నుంచి చివరి వరకు అవగాహన కల్పించాలి. ఈ కృషిలో భాగంగా ప్రచారం అన్నది తప్పనిసరి.

స్థానికుల నిర్వహణ అన్న దానిలో కనీసం నాలుగు అంశాలుంటాయి: పునాది – నాయకత్వం (నాయకులు, క్యాడర్/యానిమేటర్లు, ఫెసిలిటేటర్లు); అజెండా/మిషన్ మరియు నిర్మాణం; ప్రచారం. పునాదిని నిర్మించడం (సంబంధాలు, వ్యక్తిగత అనుసరణ, ప్రజలను కలవడం, ప్రజలు తమ నైపుణ్యాలను ఆచరించేలా చేయడం), నాయకత్వాన్ని నిర్మించడం (వారిలో విశ్వాసాన్ని పాదుకొల్పడం, నాయకులను నిర్మించడం, సమిష్టి నాయకత్వాన్ని పెంపొందించడం, భవిష్యత్తు కోసం సిద్ధం చేయడం) విలువలు, లక్ష్యాలు/కార్యక్రమాలు, కమ్యూనికేషన్ చానెల్స్ మొదలైన వాటితో సంస్థలను దీర్ఘకాలిక అజెండా కోసం సిద్ధం చేయడం, సభ్యత్వాన్ని పెంపొందించడానికి మరియు సభ్యులు లాభపడేందుకు అభ్యాస కార్యక్రమాలు దీనిలో ప్రధానాంశాలు.

మనం సంస్థలకు సహకారం, సేవలు అందించగలమా?

వ్యక్తిగత సంస్థలు, కుటుంబ సంస్థలు, బృంద సంస్థలు, సమిష్టి సంస్థలు మరియు సామాజిక సంస్థలు ఉన్నాయి. అవి వ్యవసాయేతర రంగంలో కావచ్చు, వ్యవసాయం బయటి రంగంలో కావచ్చు, వ్యవసాయ సంస్థలు కావచ్చు, పశుగణం మీద ఆధారపడిన సంస్థలు కావచ్చు, మత్స్యరంగం మీద ఆధారపడినవి కావచ్చు, అటవీ ఆధారితం కావచ్చు, హస్తకళా ఆధారితం కావచ్చు, సాంప్రదాయ కళాకారుల ఆధారితం కావచ్చు. వారు రైతులు కావచ్చు, చేనేత కళాకారులు కావచ్చు, గొర్రెల కాపరులు కావచ్చు. విద్యాసంస్థలు కావచ్చు, ఆరోగ్య రంగంలో కావచ్చు, సామాజిక రంగంలో కావచ్చు. లేదా పౌర సామాజిక సంస్థలు కావచ్చు. గ్రామ పంచాయితీలు కావచ్చు. అవి సంస్థలకు సేవలు అందించే సంస్థలు కావచ్చు. ప్రస్తుతం కొనసాగుతున్న మరియు కొత్త సంస్థలకు కూడా సహకారం/సేవలు అందించడం అవసరం. వాటికి అవసరమైన సహకారం/సేవలలో శిక్షణ, దూరదృష్టి, ప్లానింగ్, మానవ వనరులు, నైపుణ్యాలు అందజేయడం, ముడి సరుకులు, నిర్వహణ, సమస్యల పరిష్కారం, రవాణా, అకౌంటింగ్, ఆడిట్, ఎమ్ఐఎస్, మార్కెట్ వివరాలు, బ్రాండింగ్, కొనుగోళ్లు, విక్రయాలు, కస్టమ్–ప్రాసెసింగ్, రేటింగ్, రుణాలు, ఈక్విటీ, బీమా మొదలైనవి ఉంటాయి.

వాటిని ప్రారంభించడానికే సహకారం అవసరం కావచ్చు. ఈ సహకారం/సేవలను వాటిని సర్వీస్ ప్రొవైడర్లతో కలపడం ద్వారా, కొంతమంది సర్వీస్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ ప్రొఫెషనల్స్, బృందాన్ని అభివృద్ధి చేయడం ద్వారా, మరియు/లేదా ఇతర పరిశ్రమలతో సంబంధాలు నెలకొల్పడం ద్వారా చేయవచ్చు. పెద్ద సర్వీస్ ప్రొవైడర్లతో సంబంధాలు కూడా నెలకొల్పవచ్చు. దానికి లభించే పరిష్కారం డిజిటల్ రంగంలో ఒక ఓలా కావచ్చు, ఒక ఫ్లిప్‌కార్ట్‌లాంటిది కావచ్చు, ఓఎల్ఎక్స్ కావచ్చు, లేదా వీటన్నిటి కలయిక కావచ్చు. భౌతిక, ఆర్థిక రంగంలో అది ఒక సూపర్/హైపర్ మార్కెట్ కావచ్చు, మాల్ కావచ్చు, స్థానిక మార్కెట్ కావచ్చు, చిట్‌ఫండ్ కావచ్చు, బ్యాంక్ కావచ్చు, ఇన్వెస్టర్ మొ.వి. కావచ్చు. ఇప్పటికే ఉన్న సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా లేదా/మరియు సర్వీస్ ప్రొవైడర్ల ఫెసిలిటేటింగ్/సహకార సంస్థలు మరియు ఎంటర్‌ప్రెన్యూర్ల సహకారంతో వీటన్నిటినీ ఆచరణసాధ్యం చేయవచ్చు.

మనం దీనిని నిర్వర్తించగలమా? నా స్నేహితులు, నాతో కలిసి పని చేస్తున్న సహచరులు ఇది సాధ్యమే అంటున్నారు. సాధ్యమే అయితే, ఇది ఖర్చులను తగ్గించి, తక్కువ సంఘటితమైన సంస్థల ఆదాయాన్ని గణనీయంగా పెంచుతుంది.

**జి. మురళీధర్** ✷

ఆమ్ ఆద్మీ సంభాషణ

## ప్రభుత్వ టీచర్ ఉద్యోగం పొందాలి...

**మీ గురించి మరియు మీ కుటుంబం వివరాలు తెలపండి?**



నా పేరు బి. పరశురాములు, వయస్సు 28 సం॥రాలు. నేను బి.ఎస్సీ & బి.ఎడ్‌ను పూర్తిచేశాను. మాది మరిపెడ గ్రామం & మండలం, వరంగల్ జిల్లా. నా కుటుంబంలో నేను, నా భార్య, కూతురు మరియు నా తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాను. నా తండ్రి వ్యవసాయ రైతు. మాకు 3 ఎకరాల భూమి ఉంది. అందులో మిర్చి, పత్తి పంటలను పండిస్తున్నాము. నా భార్య మరిపెడ బాలికల హాస్టల్‌లో పారా టీచర్‌గా పనిచేస్తూ, నా కుటుంబానికి సహాయం చేస్తుంది. నా కూతురు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతుంది. నా తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తుంటారు. వ్యవసాయ పనులు లేని సమయంలో MGNREGS పనులకు కూడా వెళ్తుంటారు.

**ప్రస్తుతం మీరేమి పనిచేస్తున్నారు?**

నేను గత 3 సంవత్సరాలుగా మరిపెడ మండల మహిళా సమాఖ్య (MMMS)లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. నా పనిలో భాగంగా అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (APM) యొక్క సూచనలు మరియు ఆదేశాల మేరకు పనిచేస్తుంటాను. MMMSకి సంబంధించి అన్ని లావాదేవీలను కంప్యూటర్ ద్వారా నిర్వహిస్తుంటాను. ఈ MMMS కింద 68 గ్రామైక్య సంఘాలు (VOలు), 1700ల స్వయం సహాయక సంఘాలు (SHGలు) ఉన్నాయి. వాటి సభ్యత్వాలను ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేస్తాను. కంప్యూటర్‌లో వాటికి సంబంధించిన లావాదేవీల(పొదుపు, చెల్లింపులు, సామాజిక పెట్టుబడి నిధి (CIF), వడ్డీ, ఇన్సూరెన్స్ మొ.వి)ను డేటా ఎంట్రీ చేస్తాను. ఈ మొత్తం ప్రక్రియ VO, SHGలకు పారదర్శకంగా ఉంటూ జవాబుదారీతనంగా ఉంటుంది.

నేను నెలకు రూ.6500లు MMMS ద్వారా వేతనంగా పొందుతున్నాను. కానీ, ఈ వేతనం నా కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదు. అయినప్పటికీ, ఇన్ని సంఘాలతో పని చేయడం నాకు ఎంతగానో సంతోషంగా ఉంది. MMMS వారు నా వేతనం పెంచితే చాలా సంతోషపడతాను.

**మీరు గతంలో ఏమి చేసేవాడివి?**

నా డిగ్రీ పూర్తయిన తరువాత, నేను వ్యవసాయ పనులలో నా తల్లిదండ్రులకు సహాయంగా ఉన్నాను. ఆ తరువాత, నేను ప్రభుత్వ టీచర్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను. కానీ, నేను టీచర్ ఉద్యోగం పొందడానికి ఉత్తీర్ణుడిని కాలేను. దాని తరువాత నేను MMMSలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకొని, తరువాత ఎన్నికయ్యాను.

**మీరు పాల్గొన్న శిక్షణల గురించి చెప్పండి?**

నేను కంప్యూటర్ ఆపరేటర్ కార్యక్రమాలపై 3 రోజుల శిక్షణను పొందాను.

**నీవు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?**

నేను MMMS ఇచ్చే పనుల ద్వారా ఒత్తిడి మరియు ఎక్కువ పనులను నాకే అప్పచెప్పడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నాను.

**మీరు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్ధి పొందారా?**

నేను ప్రభుత్వం నుండి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డులను పొందాను.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

నా కోరిక ప్రభుత్వ టీచర్ ఉద్యోగం పొందాలి. నా కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి మరియు నా కూతురికి ఉన్నత విద్యను అందించాలి. ✷

నిస్సహాయుల సంభాషణ

## నేను త్వరగా కోలుకోవాలి...

**మీ గురించి మరియు కుటుంబ నేపథ్యం చెప్పండి?**

నా పేరు ఏపూరి పార్వతీశ్వరరావు, వయస్సు 58 సం॥రాలు. నేను నిరక్షరాస్యుడిని. నేను నా భార్య నుండి విడిపోయాను. నాకు ఒక కూతురు ఉంది. ప్రస్తుతం నేను నా తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాను. మాది చెరువుమాదారం గ్రామం, నేలకొండపల్లి మండలం, ఖమ్మం జిల్లా.

**మీరు ఏం చేస్తున్నారు?**

గతంలో నేను మా గ్రామంలో టైలర్‌గా పనిచేసేవాడిని. కానీ, గత 6 నెలలుగా నేను పనిచేయడం లేదు. కారణం నేను క్షయవ్యాధి(టి.బి)తో బాధపడుతున్నాను. నాకు ఇంట్లో పనులు కూడా చేయడానికి సరైన శక్తి కూడా లేదు. నా తల్లిదండ్రులు నాకు సహాయం చేస్తున్నారు. వారు చాలా వృద్ధాప్యంలో ఉన్నారు. అయినప్పటికీ, వారు వ్యవసాయ కూలీపనులకు వెళ్తూ, కొంత కూలీని పొందుతూ మా కుటుంబాన్ని నడుపుతున్నారు.

నేను పనిచేసేటప్పుడు, మా గ్రామం మరియు చుట్టుప్రక్కల గ్రామాల నుండి బట్టలు కుట్టడానికి ఆర్డర్లు వచ్చేవి. నేను సాధారణంగా చొక్కాలు, ప్యాంట్లను కుట్టడం మరియు ఆల్ట్రేషన్ పనిని కూడా చేసేవాడిని. ఆ సమయంలో ఈ పని ద్వారా నేను నెలకు రూ.2,000ల నుండి 3,000ల వరకు పొందేవాడిని.

**మీ భార్య మరియు కూతురు గురించి చెప్పండి?**

గత 10 సం॥రాల క్రితం కుటుంబ తగాధాల వల్ల నా భార్య నన్ను వదిలి వెళ్ళిపోయింది. మా తగాధాలు పంచాయతీ పెద్దల వరకు వెళ్ళింది. అప్పుడు వారు మమ్మల్ని వేరుగా ఉండమని ఆదేశించారు. అప్పటినుండి నా భార్య ప్రక్కనే ఉన్న గ్రామంలో ఉంటూ, అక్కడే మహిళా సంఘంలో చేరి, కొన్ని రోజులకు ఆ సంఘానికి పుస్తకాలు రాస్తుండేది. ఆ తరువాత, గ్రామంలో మాస్టర్ బుక్‌కీపర్‌ను వివాహం చేసుకొని, కలిసి అతని గ్రామంలో ఉంటుంది. నా కూతురికి పెళ్ళి చేశాను. తను అత్తింట్లో స్థిరపడింది.

**మీకు ఈ వ్యాధి ఎలా వ్యాపించింది?**

నాకు ఈ వ్యాధి మా ఇంటికి ప్రక్కనే ఉన్న వ్యక్తితో వ్యాపించింది. మేమిద్దరం రెగ్యులర్‌గా కలవడం మరియు మాట్లాడుకుంటుండేవాళ్ళం. అప్పుడే అతని నుండి నాకు వ్యాపించింది. కొన్ని రోజులకు, నా ఆరోగ్యం క్షీణించడంతో నేను ఆసుపత్రికి వెళ్ళి డాక్టర్‌కు చూపించాను. అప్పుడు ఆ డాక్టర్ పరీక్ష చేసి నాకు టి.బి. వచ్చిందని నిర్ధారణ చేశాడు. ఆ వ్యాధికి గాను మందులు కూడా ఇచ్చాడు. వాటిని వాడుతున్నాను. ఆ తరువాత, కొంతమంది కమ్యూనిటీ వర్కర్లు నన్ను కలిసి ఈ వ్యాధికి సంబంధించి ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంతటి కష్టకాలంలో నా తల్లిదండ్రులకు వచ్చే పింఛన్లే నాకు మరియు కుటుంబానికి సహాయ పడుతుంది.

**మీరు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?**

ఈ వ్యాధితో నేను బలహీనత, పోషకాహారం లోపం మరియు సంరక్షణ లేకపోవడం వంటివి ఎదుర్కొంటున్నాను.

**మీరు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్ధి పొందారా?**

ప్రభుత్వం నుండి ఓటర్‌కార్డు, రేషన్ కార్డు మరియు ఆధార్‌కార్డులను పొందాను.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

నా కోరిక, నేను ఈ వ్యాధి నుండి త్వరగా కోలుకోవాలనుకుంటున్నాను. తరువాత నా తల్లిదండ్రుల సంరక్షణకు పాటుపడాలనుకుంటున్నాను. ✷

## కమ్యూనిటీ లీడర్ సంభాషణ

# ESHG సభ్యుల సాధికారతకై పనిచేయాలి...



**మీ గురించి చెప్పండి?**

నా పేరు ఆరెపల్లి రాజవ్వ, వయస్సు 57 సం॥రాలు. మా గ్రామం చీకోడు, ముస్తాబాద్ మండలం, కరీంనగర్ జిల్లా. నేను నిరక్షరాస్యురాలిని. మా కుటుంబంలో నేను, నా భర్త, మరియు ఇద్దరు పిల్లలు ఉంటాము. పిల్లలిద్దరికి పెళ్ళిళ్ళై స్థిరపడ్డారు.

**మీరు ఏం పనిచేస్తారు?**

నేను 2014 నుండి చీకోడు వృద్ధుల గ్రామైక్య సంఘం(CEVLF)నకు కోశాధికారిగా సేవలందిస్తున్నాను. మరియు 2013 నుండి కోకిల వృద్ధుల స్వయం సహాయక సంఘం (KESHG)నకు అధ్యక్షురాలిగా ఉంటున్నాను. నేను బీడీలు చేయడం, వ్యవసాయ కూలీ పనులకు వెళ్లడం మరియు అన్‌సీజన్‌లో MGNREGS పనులు వెళ్ళడం వంటివి చేస్తుంటాను.

కోశాధికారిగా నా బాధ్యతలు: ప్రతినెల మొదటి వారంలో VLF సమావేశాలను నిర్వహించడం, పొదుపులను సేకరించి ముస్తాబాద్ బ్యాంకులో డిపాజిట్లు చేయడం, VLF అధ్యక్ష, కార్యదర్శులకు సమావేశం క్రమపద్ధతిలో నడపడానికి మరియు VLF కార్యక్రమాలలో సహాయం చేయడం వంటివి చేస్తుంటాను.

VLF బ్యాంకు నుండి మరియు హెల్పేజ్ ఇండియా సంస్థ నుండి రుణాలు పొందుతాము. పొందిన రుణాలను ESHGలకు తక్కువ వడ్డీతో ఇస్తాము. ESHG నిబంధనలకు అనుగుణంగా సభ్యులకు అంతర్గత రుణాలు ఇస్తారు. మా పాలకవర్గం VLF మరియు ESHGలకు సంధాన కర్తలుగా పనిచేస్తాము. మేము ESHG సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తుంటాము. మరియు ESHGలలో ఏమైన సమస్యలు వస్తే వాటిని పరిష్కరిస్తాము. అంతేగాకుండా వృద్ధుల హక్కులు, రాయితీలు గూర్చి పోరాడుతున్నాము.

VLF కార్యదర్శిగా కాకుండా, నేను వృద్ధుల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (ECRP)గా నల్లగొండ జిల్లా, చౌటుప్పల్ మండలంలో పనిచేస్తున్నాను. ఇందులో భాగంగా ESHGల ఏర్పాటు, వృద్ధులను చైతన్యపరచడం, మరియు ESHGల భావనలు మరియు ఆవశ్యకతను గూర్చి వృద్ధులకు చెప్పడం వంటివి. ఈ కార్యక్రమం 10 రోజులపాటు మండల పరిధిలోని గ్రామాలలో చేయడం జరిగింది. అందుకుగాను రూ. 3,000 రిసోర్స్ ఫీజును పొందాను. ఈ పని నా జీవితానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

**మీరు ఏమైనా శిక్షణలు తీసుకున్నారా?**

నేను ECRP మరియు పాలకవర్గం పాత్రలు-బాధ్యతలు గూర్చి ఒక వారంపాటు శిక్షణలు తీసుకున్నాను. ఈ శిక్షణలు క్షేత్రస్థాయిలో ESHGల ఏర్పాటులో నాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

**మీరు ఏమైన సమస్యలను ఎదుర్కొంటున్నారా?**

క్షేత్రస్థాయిలో వృద్ధుల సమస్యలు పరిష్కరించే క్రమంలో ESHG సభ్యులు అంతగా సహాయం చేయలేకపోతున్నారు.

**మీరు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్ధి పొందారా?**

నేను ప్రభుత్వం నుండి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు మరియు ఉపాధి హామీ కార్డులను పొందాను.

**మీ భవిష్యత్ లక్ష్యం ఏమిటి?**

నేను ESHG సభ్యుల కుటుంబ సమస్యలను పరిష్కరించి, వారి హక్కులు, రాయితీలపై పోరాడాలనుకుంటున్నాను. మరియు వృద్ధులు సాధికారత చెంది తమ పిల్లలపై ఆధారపడకుండా సహాయం చేయాలను కుంటున్నాను. ✷

## కమ్యూనిటీ వర్కర్ సంభాషణ

# వృద్ధుల సంరక్షణ కొరకు పనిచేయాలి...



**మీ గురించి చెప్పండి?**

నా పేరు క్రిష్ణవేణి, వయస్సు 24 సం॥రాలు. నేను 10వ తరగతి వరకు చదువుకున్నాను. నా సొంతూరు గూడూరు, ముస్తాబాద్ మండలం, కరీంనగర్ జిల్లా. మా కుటుంబంలో నేను, నా భర్త, కూతురు మరియు కొడుకు ఉంటాము. నా భర్త ఆర్టిస్ట్(బోర్డులు రాయడం)గా పనిచేస్తున్నాడు. నా పిల్లలిద్దరూ చదువుతున్నారు.

**ప్రస్తుతం మీరు ఏమి పనిచేస్తున్నారు? ఎంత సంపాదిస్తారు?**

నేను వృద్ధుల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్(ECRP)గా 2015 నుండి పనిచేస్తున్నాను. అందుకుగాను ప్రతినెల 10 రోజుల సమయాన్ని కేటాయిస్తాను. వేతనంగా రూ. 4,950లు పొందుతున్నాను. మిగిలిన రోజులలో బీడీల తయారీ మరియు వృద్ధుల స్వయం సహాయక సంఘాల (ESHGs)కు వాలంటీర్‌గా పనిచేస్తున్నాను.

ప్రస్తుతం, నేను ECRPగా నల్లగొండ జిల్లా, చౌటుప్పల్ మండలంలో పనిచేస్తున్నాను. అందులో భాగంగా వృద్ధులను చైతన్యపరచడం, ESHGల ఏర్పాటు, ESHGల భావనలు, ఆవశ్యకత మరియు లబ్ధిలను గూర్చి వారికి చెప్పడం, అవి ఎలా నడుపుకోవాలి, మరియు వృద్ధుల యొక్క హక్కులు, రాయితీలు మొ.వి. వారికి తెలియజేయడం వంటివి చేస్తుంటాను.

గతంలో వృద్ధులు మమ్మల్ని నమ్మేవారు కాదు. కావున, మేము గ్రామస్థాయిలో ఉండే స్థానిక ప్రతినిధులు, గ్రామ పెద్దలను కలిసి ఆదర్శ ESHGల భావనలు మరియు ఆవశ్యకతల గూర్చి వారికి చెప్పి, వారి సహాయంతో గ్రామాల్లో ESHGల ఏర్పాటు చేయడం మొదలు పెట్టాము. ఆ విధంగా చౌటుప్పల్ మండల పరిధిలో ఉన్న 14 గ్రామాల్లో 26 ESHGలను ఏర్పాటు చేశాము. ఆ గ్రామాలు: తంగెడుపల్లి, అల్లాపూర్, దేవలమ్మ నాగారం, పీపల్‌పహడ్, కుంట్లగూడెం, నేలపట్ల, పంతంగి, ధర్మోజీగూడెం, చిన్న కొండూర్, పెద్ద కొండూర్, మందోళ్ళ గూడెం, జై కేసారం, కొయ్యలగూడెం. ఈ గ్రామాల్లో చాలా మంది వృద్ధులు తమ కుటుంబ సభ్యులతో సమస్యలతో పాటు అనారోగ్య సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారు.

**మీరు గతంలో ఏమి చేసేవారు?**

నా చదువు పూర్తయిన తరువాత, నేను ESHGలకు బుక్‌కీపర్‌గా పనిచేశాను. దాంట్లో భాగంగా నేను ప్రతినెల 2 సార్లు సంఘ సమావేశాలను నిర్వహించి, పుస్తకాలు రాయడం, రుణ లావాదేవీల వంటి పనులు చేసేదానిని. ఆ తరువాత నేను ముస్తాబాద్ మండల సమాఖ్య కింద NPMలో CRPగా పనిచేశాను. అందులో భాగంగా స్థానిక రైతులకు NPMపై అవగాహన కల్పించి, దాని వల్ల రైతుల జీవనోపాధికి అభివృద్ధి ఏ విధంగా ఉపయోగ పడుతుందో చెప్పడం జరిగింది. ఆ తరువాత నేను కరీంనగర్ జిల్లా, కాటారం మరియు మంథని మండలాలలో CRPగా పనిచేశాను.

**మీరు క్షేత్రస్థాయిలో ఏమైన సమస్యలను ఎదుర్కొంటున్నారా?**

క్షేత్రస్థాయిలో వృద్ధులను సంఘాలుగా ఏర్పరచటానికి మమ్మల్ని నమ్మి వారిని ఒప్పించడమనేది చాలా కష్టం. అటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నాను.

**మీరు ప్రభుత్వం నుండి ఏమైనా లబ్ధి పొందారా?**

నేను ప్రభుత్వం నుండి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డులను పొందాను.

**భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

వృద్ధులకు గ్రామ, మండల స్థాయిలో సంఘాలు ఏర్పరచి, వారి సంరక్షణకై పనిచేయాలనుకుంటున్నాను. ✷

# పేద సభ్యుల కొరకు పనిచేయాలి...



**మీ గురించి చెప్పండి?**

నా పేరు ఎ. పద్మావతి, వయస్సు 42 సం॥రాలు. నేను దూరవిద్య ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. మా సొంతూరు బాల్మూరు గ్రామం, అచ్చంపేట మండలం, మహబూబ్‌నగర్ జిల్లా. నా భర్త వ్యవసాయ రైతు. గత 20 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. మాకు ఇద్దరు కొడుకులు. వారిలో పెద్దోడు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. చిన్నోడు బి.టెక్ చదువుతున్నాడు.

**మీరు ఎక్కడ పనిచేస్తున్నారు?**

నేను 2008 నుండి కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ (CC)గా అచ్చంపేట మండల మహిళా సమాఖ్య(AMMS)లో పనిచేస్తున్నాను. అందులో భాగంగా స్వయం సహాయక సంఘాల(SHGలు)కు పంచసూత్ర ప్రాముఖ్యత మరియు జీవనోపాధుల అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణలు ఇస్తుంటాను.

అంతేగాకుండా, ప్రతి నెలలో జరిగే అన్ని గ్రామైక్య సంఘాల (VO) సమావేశాలకు మరియు AMMS సమీక్ష సమావేశానికి హాజరవుతాను. మరియు VO సహాయకుల(VOA)కు VOల నిర్వహణకు బుక్‌కీపింగ్, సామాజిక పెట్టుబడి నిధి (CIF) అమలు, తిరిగి చెల్లింపులు, పర్యవేక్షణ, స్త్రీనిధి మరియు అభయహస్తం పథకాలపై శిక్షణలు ఇస్తుంటాను. క్లస్టర్ స్థాయిలో VOAలను సమీక్షిస్తుంటాను. SHGలను బ్యాంకులతో అనుసంధానం చేసి రుణాలు ఇప్పించడం మరి తిరిగి చెల్లించడం వంటివి, మరియు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి మరియు అభయహస్తం నివేదికలను తయారు చేస్తుంటాను. ఒక వేళ ఎవరైన VOA అందుబాటులో లేకుంటే ఆ VO సమావేశాన్ని నిర్వహించడం మరియు మొబైల్ బుక్‌కీపింగ్ కూడా చేయడం జరుగుతుంది. వీటితో పాటు కన్వర్జెన్స్‌లో భాగంగా ప్రభుత్వ సంస్థలు మరియు బ్యాంకులతో సమావేశాలకు హాజరవుతాను. మరియు VOలలో ఏమైనా సమస్యలు వస్తే నాకు మా అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (APM) సమస్య పరిష్కారానికి సహాయం చేస్తారు. నెలలో అన్ని VOల సమావేశాలకు హాజరయిన తరువాత మా APM సహకారంతో జిల్లా ప్రధాన కార్యాలయానికి సమాచారాన్ని అప్‌డేట్ చేస్తాము. నా నెలవారీ పనికి సంబంధించిన ప్రణాళిక పనులు మరియు పూర్తి చేసిన నివేదికలను APMకు సమర్పిస్తాను.

ప్రస్తుతం, నేను CCగా AMMSలో పనిచేస్తున్నాను. ఈ AMMS పరిధిలో బాల్మూర్, తెలకపల్లి మరియు లింగాల గ్రామాలు ఉన్నాయి. నేను గిరిజన గ్రామీణ సంఘటిత హామీ కార్యక్రమం (TRIGP) కింద వ్యవసాయేతర రంగం (NFS)లో పనిచేస్తున్నాను. ఈ కార్యక్రమం కింద పేద మహిళలు రకరకాల వ్యాపారాలు ఏర్పాటు చేయడానికి సహాయం చేస్తుంటాను. ఈ కార్యక్రమాన్ని మహిళలు ఉపయోగించుకొని తమకుతాము సాధికారత చెంది వ్యాపారాలు చేసుకొనే విధంగా చూస్తాము. ఇందులో భాగంగా మహిళలు పలు వ్యాపారాలు చేస్తున్నారు. అవి: కిరాణ దుకాణాలు, చికెన్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు, బట్టల దుకాణాలు, టైలరింగ్ దుకాణాలు మరియు ప్రయాణికుల కొరకు ఆటోలు నడపడం వంటివి కూడా వారు చేస్తున్నారు. ఈ కార్యక్రమం కింద మేము వారికి వ్యాపారాలు ఏర్పాటుచేసుకోవడానికి సాంకేతిక శిక్షణను అందిస్తాము. మా AMMS ఔత్సాహిక మహిళా వ్యాపారులకు 0% వడ్డీతో రుణ సహాయాన్ని అందిస్తుంది. ఇప్పటి వరకు, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక కార్యక్రమం కింద 41 మంది ఎస్సీ మహిళలు లబ్ధి పొందారు. ఈ కార్యక్రమం కింద ప్రతి సభ్యురాలు రూ.50,000లు ఆర్థిక సహాయం పొందారు. ఈ మొత్తం ప్రక్రియ AMMS నుండి VO, VO నుండి SHG స్థాయిలో జరిగింది. ప్రతి శనివారం మా AMMS సిబ్బంది కార్యక్రమం సమీక్షించి, ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారు. నేను APM, ఏరియా కో-ఆర్డినేటర్ (AC) మరియు డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్(DPM)ల సూచనలు మరియు ఆదేశాలను అనుసరిస్తాను.

పేద ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకొని మెరుగైన జీవనాన్ని సాగిస్తున్నారు. ఇది పేద ప్రజల అభివృద్ధికి ఆదర్శంగా ఉంది. దీనివల్ల పేదలు పేదరికం నుండి బయట పడటానికి ఎంతో ప్రేరణను ఇస్తుంది.

**మీరు ఈ అభివృద్ధి రంగంలో ఎలా వచ్చారు?**

నా 10వ తరగతి పూర్తయిన తరువాత, నేను జిల్లా వార్తాపత్రికలో ప్రచురించిన CC కొరకు నోటిఫికేషన్‌ను చూసి, ఆ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాను. తరువాత, నేను వ్రాతపరీక్ష, గ్రూప్ చర్చ మరియు ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించి, ఎంపికయ్యాను. ఈ మొత్తం ప్రక్రియ జిల్లా స్థాయిలో జరిగింది.

**మీరు గతంలో ఎక్కడెక్కడ పనిచేశారు?**

నేను 2005-06లో కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్(CRP)గా పనిచేశాను. అందులో భాగంగా VO మరియు SHGల సభ్యులకు శిక్షణలు ఇచ్చాను. 2006-07లో MGNREGS CRPగా పనిచేశాను. అందులో భాగంగా కూలీలకు ఉపాధి జాబ్‌కార్డులను ఇప్పించడం, సాంకేతిక సహాయం చేయడం, పనులు మరియు కూలీలు పొందే విధంగా చూడటం వంటివి. 2007-08లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (MEPMA)లో CRPగా పనిచేశాను. అందులో భాగంగా SHG సభ్యులకు గ్రూపు సమావేశాలు, పొదుపులు, అంతర్గత అప్పులు, చెల్లింపులు, పుస్తకాల నిర్వహణపై సహాయం అందించాను. అంతేగాకుండా పేదలకు జనశ్రీ బీమా యోజన, ఆమ్‌ఆద్మీ బీమా యోజన వంటివి పొందేవిధంగా చేశాను.

**మీరు పాల్గొన్న శిక్షణల గురించి చెప్పండి?**

నేను APARD ద్వారా SHG, VOల బుక్‌కీపింగ్, స్త్రీనిధి, CIF, బ్యాంక్ లింకేజీలపై పలురకాల శిక్షణలు పొందాను. TRIGP కింద వ్యవసాయేతర వ్యాపారాలు మరియు MGNREGSకు సంబంధించిన శిక్షణలు పొందాను. నేను CRPగా, CCగా సుమారు 40 రకాల శిక్షణలు పొందాను.

**మీ ఉద్యోగ నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు గూర్చి చెప్పండి?**

నా ఉద్యోగ నిర్వహణలో చాలా సమస్యలు ఉన్నాయి. అవి: క్షేత్రస్థాయిలో రాజకీయ పార్టీల నుండి సమస్యలు ఎదురవుతున్నాయి. అవేమనగా, ఏదైన లబ్ధికి సంబంధించి, రాజకీయ పార్టీలవారు తమకు సంబంధించిన వారికే ఇవ్వాలని నన్ను ఒత్తిడి చేయడం వంటివి. అయినప్పటికీ, నా ఉద్యోగ బాధ్యతలలో భాగంగా నియమ నిబంధనలు పాటించే అనుసరిస్తున్నాను.

**మీకు ఈ పని వలన సంతృప్తి కలుగుతుందా?**

నేను SHGలకు సహాయం చేయడం చాలా సంతోషకరంగా ఉంది. అంతేగాకుండా పేదలు తమకు తాము ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందటం అనేది చాలా గొప్ప విషయం.

**మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?**

నేను పేద సభ్యుల కొరకు పనిచేయాలనుకుంటున్నాను. అంతేగాకుండా వారు SHGల ద్వారా తమకుతాము సాధికారత చెందటం కొరకు జాగృతి చేయటం మరియు ప్రభుత్వ పథకాలు పేద మహిళలందరికి అందేలా చూడాలనుకుంటున్నాను ✸

ఫోకస్

# స్వయం ఉపాధి

భారతదేశంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో స్వయం ఉపాధి విస్తృతంగా ఉంది. మొత్తం స్వయం ఉపాధిలో వ్యవసాయ అనుబంధ రంగాలలో స్వయం ఉపాధి వాటా సుమారు ముప్పాతిక శాతంగా ఉంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో యజమాని అంటూ లేని వ్యవసాయేతర కార్యకలాపాలనే స్వయం ఉపాధి అని పేర్కొంటున్నారు. స్వయం ఉపాధిలో ఎక్కువ ఆదాయం, తక్కువ ఆదాయం లభించే ఉపాధులున్నాయి. ఈ నేపథ్యంలో 'జీవనోపాధులు' ప్రజలు తమ కనీస అవసరాలు తీరడం కోసం చేపట్టే 'స్వయం ఉపాధి' అన్న అంశాన్ని పరిశీలించింది.



భారతదేశంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో స్వయం ఉపాధి విస్తృతంగా ఉంది. మొత్తం స్వయం ఉపాధిలో వ్యవసాయ అనుబంధ రంగాలలో స్వయం ఉపాధి వాటా సుమారు ముప్పాతిక శాతంగా ఉంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో యజమాని అంటూ లేని వ్యవసాయేతర కార్యకలాపాలనే స్వయం ఉపాధి అని పేర్కొంటున్నారు. స్వయం ఉపాధిలో ఎక్కువ ఆదాయం, తక్కువ ఆదాయం లభించే ఉపాధులున్నాయి. ఈ నేపథ్యంలో 'జీవనోపాధులు' ప్రజలు తమ కనీస అవసరాలు తీరడం కోసం చేపట్టే 'స్వయం ఉపాధి' అన్న అంశాన్ని పరిశీలించింది.



చేనేత పనివారు, వీధి వర్తకులు, బీడీలు చుట్టేవాళ్లు, రిక్షాలాగేవాళ్లు మొదలైన వారిని స్వతంత్ర స్వయం ఉపాధి పనివాళ్లు అనవచ్చు. వీళ్లు పూర్తిస్థాయి ఉద్యోగులు కాదు. తమ అవసరాలను బట్టి వీరు అవసరమనుకుంటే పని చేస్తారు. వీరు తాము, తమ కుటుంబసభ్యులకు మాత్రమే జవాబుదారీతనం వహిస్తారు. మరోవైపు డాక్టర్లు, లాయర్లు, కళాకారులు, అకౌంటెంట్లు, రైస్ మిల్ యజమానులు, వర్క్‌షాపుల జయజమానులు, కమిషన్ ఏజెంట్లు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, చిన్న హొటళ్లు, రెస్టారెంట్ల యజమానులు, మొదలైన స్వతంత్ర ప్రొఫెషనల్స్/పనివాళ్లు ఎక్కువ ఆదాయం పొందే స్వయం ఉపాధి కిందకు వస్తారు. చేనేత పనివాళ్లు, వీధి వర్తకులు, ఫుడ్ ప్రాసెసింగ్ పనిలో ఉన్నవాళ్లు, రిక్షాలు లాగేవాళ్లు, ఆటో డ్రైవర్లు, చెత్త ఏరుకునే వాళ్లు, టైలర్లు, బీడీలు చుట్టేవాళ్లు, అగర్‌బత్తీలు తయారు చేసేవారు, కుమ్మరులు, మేదరి వృత్తి చేసేవారు, వీధుల్లో తిరుగుతూ తినుబండారాలు విక్రయించేవారు, జిరాక్స్ సెంటర్ల యజమానులు, పళ్లు/పూల వర్తకులు, సొంత ఆటో/వాహనాల యజమానులు, ఇంటర్‌నెట్ కేఫ్ యజమానులు, టిఫిన్ సెంటర్ల యజమానులు మొదలైన వారు తక్కువ ఆదాయాన్ని పొందే స్వయం ఉపాధిదారులు. మన దేశంలో సుస్థిరమైన వ్యాపార కార్యకలాపాలకన్నా, తక్కువ ఆదాయం లభించే స్వయం ఉపాధినే చాలా మంది జీవించేందుకు ఒక మార్గంగా ఎంపిక చేసుకుంటారు. స్వయం ఉపాధి వారిలో ఎక్కువ భాగం ప్రజలకు తక్కువ చదువు ఉండి, వారికి ఎక్కువ పెట్టుబడి ఉందుబాటులో ఉండదు.

మన దేశంలో స్వయం ఉపాధిలో లేబర్ మార్కెట్‌లా రకరకాల కార్యకలాపాలు ఉంటాయి. చాలా మంది వ్యక్తులు రకరకాల కారణాల కోసం స్వయం ఉపాధిని ఎంపిక చేసుకుంటారు. అందువల్ల ఈ బృందంలో రకరకాల పనివాళ్లు కనిపిస్తారు. వ్యక్తులు తమ ఆదాయ నిచ్చెనలో పై స్థానాన్ని చేరుకోవడానికి స్వయం ఉపాధిని ఒక మార్గంగా ఎంచుకుంటారు.

**స్వయం ఉపాధి లక్షణాలు:**

స్వయం ఉపాధిలో ఈ క్రింది ముఖ్య లక్షణాలు కనిపిస్తాయి:

* అనేక సాంప్రదాయ, సాంప్రదాయేతర రంగాలలో స్వయం ఉపాధిని గమనించవచ్చు. దీనిలో వ్యక్తులు తమకు ఇష్టమైన పనిని ఎంపిక చేసుకోవడానికి స్వేచ్ఛ ఉంటుంది. స్వయం ఉపాధిలో ఆయా వ్యక్తులే ఆదాయాన్ని తీసుకుంటారు.

*స్వయం ఉపాధిని సాధారణంగా ఒక్కరు కానీ, అంతకన్నా ఎక్కువ కానీ వ్యక్తులు చేపట్టి, నిర్వహించుకుంటారు. స్వయం ఉపాధిదారులు తమ రోజువారీ కార్యకలాపాలలో చురుకుగా పాలు పంచుకుంటారు. పనిలో వారే చురుకుగా పాల్గొనడం వల్ల నిర్ణయాలు తొందరగా తీసుకోవడానికి వీలవుతుంది. స్వయం ఉపాధి కార్యకలాపాల పరిధి చాలా చిన్నగా ఉంటుంది. ఇది స్థానికుల అవసరాలకు అనుగుణంగా ఉంటుంది.

*స్వయం ఉపాధిలో యజమానీ, పనివాళ్లూ ఒకరే అయి ఉంటారు. అయితే దీనిలో అతను/ఆమె ఒకరు లేదా ఇద్దరి సహాయం కూడా తీసుకోవచ్చు. అంటే స్వయం ఉపాధి వల్ల ఇతరులకు కూడా ఉపాధి లభించే అవకాశముంది.



*స్వయం ఉపాధి చేపట్టేవారికి స్థిరమైన ఆదాయం అంటూ ఉండదు. వారి ఆదాయం వారు చేసే ఉత్పత్తి మీద లేదా వస్తువులు/ఉత్పత్తుల కొనుగోళ్లు/అమ్మకాల మీద లేదా ఇతరులకు ఒక ధరకు సేవలను విక్రయించడం మీద ఆధారపడి ఉంటుంది.

*స్వయం ఉపాధిలో యజమానులే లాభాలను తీసుకుంటారు. అదే సమయంలో నష్టాలనూ వారే భరించాల్సి ఉంటుంది. ఇలా స్వయంఉపాధిలో చేసే కృషి, దానికి తగ్గ ఫలితం ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాయి.

* స్వయం ఉపాధిలో మొదట కొంత పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. కొన్నిసార్లు దీనిలో కొంత మంది పనివాళ్ల సాయాన్ని కూడా తీసుకోవాల్సి రావచ్చు.

* తన వ్యాపారాన్ని లాభదాయకంగా నిర్వహించుకొనేందుకు

తగిన నిర్ణయాలు తీసుకొనేందుకు స్వయం ఉపాధిలో స్వేచ్ఛ ఉంటుంది. దీనిలో వారు తమ వ్యాపారాన్ని విస్తరించుకొనేందుకు ఉన్న అవకాశాలను కూడా ఉపయోగించుకోవచ్చు.

* స్వయం ఉపాధిలో ఉన్నవారు తమ కార్యకలాపాల నిమిత్తం స్థానిక వనరులను ఉపయోగించుకుంటారు. చిన్నస్థాయి ఉత్పత్తి యూనిట్లు స్థానిక వనరులు, కార్మికశక్తి లభించే చోటుకి దగ్గరలో ఉంటాయి.

* స్వయం ఉపాధిలో ఆయా పరిస్థితులు, చట్టాల పరిధిలో వ్యక్తులు తమకు ఇష్టం వచ్చిన రీతిలో పని చేసేందుకు స్వేచ్ఛ ఉంటుంది.

* స్వయం ఉపాధిని ఒక వ్యక్తి లాభాల కోసం నిర్వహించే ఆర్థిక కార్యకలాపంగా పేర్కొనవచ్చు. దీనిలో వస్తువులను ఉత్పత్తి చేయడం, విక్రయించడం, వస్తువులను కొనడం/అమ్మడం, లేదా ఒక నిర్ణీత ధరలకు సేవలను విక్రయించడం ఉంటాయి.

* స్వయం ఉపాధిలో పెట్టుబడులపై ఆదాయం కోసం కొంత సమయం వేచి ఉండాల్సి రావచ్చు.

* స్వయం ఉపాధి కార్యకలాపాలలో సర్దుబాట్లు చేసుకొనే వీలుంది. ఆ పని విధానాన్ని, పని చేసే రంగాన్ని, ఉత్పత్తి క్రమాన్ని సులభంగా మార్చుకునే అవకాశముంది. అది రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది.



**స్వయం ఉపాధి మార్గాలు:**

స్వయం ఉపాధిలో ఒక సరైన కెరీర్‌ను ఎంపిక చేసుకునే ముందుగా, వ్యాపార/పారిశ్రామిక రంగాలలో ఏయే అవకాశాలు ఉన్నాయన్న దానిపై వ్యక్తులకు ఒక అంచనా అంటూ ఉండాలి. స్వయం ఉపాధిని స్థూలంగా ఈ క్రింది విభాగాలుగా వర్గీకరించవచ్చు. 1. వాణిజ్యం 2. ఉత్పత్తి 3. వృత్తి నిపుణులు 4. వ్యక్తిగత సేవలు.

***1. వాణిజ్యం:*** దీనిలో వస్తువులు, సేవల కొనుగోళ్లు/అమ్మకాలుంటాయి. ఒక చిన్న వాణిజ్య సంస్థను ప్రారంభించి, నిర్వహించేందుకు ప్రారంభంలో కొంత పెట్టుబడి అవసరముంటుంది. ఒక చిన్న కిరాణాకొట్టు, స్టేషనరీ సామాగ్రిని విక్రయించే దుకాణం, వ్యాపార ఏజెన్సీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలైనవి దీని కిందకు వస్తాయి.

***2. ఉత్పత్తి:*** స్వయం ఉపాధిలో ఇటుకలు లేదా బేకరీ తినుబండారాలు లేదా ఇతర ఆహార పదార్థాల తయారీ లాంటి చిన్న పరిశ్రమను స్థాపించవచ్చు. ఈ పరిశ్రమలన్నిటికీ తక్కువ పెట్టుబడి, సులభంగా లభ్యమయ్యే పరికరాలు అవసరమవుతాయి. ఇదే కాకుండా, వ్యవసాయ రంగంలో కూడా ఒక వ్యక్తి సొంతంగా పని చేసుకోవచ్చు లేదా ఒకరిద్దరి సాయంతో పని నిర్వహించుకోవచ్చు. ఇది పురాతన కాలం నాటి నుంచి వస్తున్న ఉపాధి. పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, చేపల పెంపకం, పళ్ల తోటల పెంపకం మొదలైనవి కూడా స్వయం ఉపాధికి మంచి ఉదాహరణలు.

***3. వృత్తి నిపుణులు:*** కొంత మంది వ్యక్తులు వృత్తి నిపుణులుగా తయారవుతారు. వీరికి అవకాశాల కోసం ఏదైనా ఒక రంగంలో ప్రత్యేక విజ్ఞానం, శిక్షణ అవసరమవుతాయి. లాయర్లు, డాక్టర్లు, ఛార్టెడ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్ట్‌లు, జర్నలిస్టులు, అభివృద్ధి కార్యకర్తలులాంటి వారు ఈ విభాగం కిందికి వస్తారు. వారికి ముందుగానే కొంత విజ్ఞానం ఉన్నప్పటికీ, ఆయా రంగాలలో రాణించడానికి వారికి మరికొంత శిక్షణ కావాల్సి రావచ్చు. ఆరోగ్యం, విద్య, అభివృద్ధి రంగంలాంటి వాటిలో అలాంటి వారి సేవలను ఉపయోగించుకోవచ్చు.

***4. వ్యక్తిగత సేవలు:*** టైలరింగ్, మోటర్ రిపేరింగ్, క్షురకులు, ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీరియర్ డెకరేటింగ్, హార్డ్‌వేర్ ఇంజనీరింగ్, మొబైల్ ఫోన్‌ల అమ్మకం, గ్యాస్ స్టవ్‌లు, తాళాల రిపేరి, చెప్పులు కుట్టడం మొదలైన స్వయం ఉపాధి చేపట్టేవారు ఈ విభాగం కిందికి వస్తారు.

వీరు వినియోగదారులకు వ్యక్తిగత సేవలు అందించే కార్యకలాపాలు చేపడతారు. ఇలాంటి వాటిని ప్రారంభించడం, నిర్వహించడం చాలా సులభం. ఈ కార్యకలాపాలు ఆయా పనిని చేపట్టే వారి నైపుణ్యం మీద ఆధారపడి ఉంటాయి. వీరే కాకుండా, చేనేత పనివారు, కమ్మరులు, కుమ్మరులు, కార్పెంటర్లు, కంసాలిలాంటి వృత్తిపరమైన కార్యకలాపాలు చేపట్టే వారు తమ ఆసక్తి, విజ్ఞానం, నైపుణ్యం ఆధారంగా తమ కెరీర్‌ను కొనసాగిస్తారు.

**స్వయం ఉపాధిలోని లాభనష్టాలు:**

***లాభాలు:***

* స్వయం ఉపాధిలో మన కృషికి తగ్గట్టుగా ఫలితాలు ఉంటాయి. దీని వల్ల దీర్ఘకాలంలో సంపాదించే సామర్థ్యం పెరుగుతుంది. ఇందులో భవిష్యత్తు అనేది వారి చేతుల్లోనే ఉంటుంది.

* స్వయం ఉపాధిలో ఎక్కువ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఉంటాయి. దీని వల్ల వారు చేపట్టే కార్యకలాపాలపై వారికి ఎక్కువ నియంత్రణ ఉంటుంది.

* స్వయం ఉపాధి పూర్తికాలం కావచ్చు లేదా పార్ట్‌టైమ్ కావచ్చు. వారు తమకు ఇష్టం వచ్చిన సమయంలో పని చేసుకోవచ్చు దీని వల్ల వారి వ్యక్తిగత జీవన ప్రమాణాలు పెరుగుతాయి. చేస్తున్న పనిలో వారికి సంతృప్తి ఉంటుంది. దీని వల్ల వారు పని కోసం ఎక్కువ దూరం వెళ్లాల్సిన అవసరముండదు. సంస్థాగత రాజకీయాలు లేకపోవడం వల్ల వారు తమ పనిలో ఎక్కువ ఆనందాన్ని పొంద గలుగుతారు.

***నష్టాలు:***

* స్వయం ఉపాధి చేపట్టేవారి విజయాలు, వైఫల్యాలు వారి చేతిలోనే ఉండడం వల్ల వారిపై ఎక్కువ ఒత్తిడి ఉంటుంది.

* స్వయం ఉపాధి చేపట్టేవారు తమకు తాముగా దారిలో వెళుతూ, తమకు తాము స్ఫూర్తిగా నిలుస్తూ వెళ్లాల్సి ఉంటుంది.

* స్వయం ఉపాధి చేపట్టేవారు పనిలోనే ఎక్కువ సమయాన్ని వెచ్చించాల్సి రావడం వల్ల వారు తమ కుటుంబంతో గడిపే సమయం తక్కువగా ఉండవచ్చు.

* స్వయం ఉపాధి కారణంగా కొన్నిసార్లు తమ సహచరులు, వినియోగదారుల నుంచి దూరం కావచ్చు.

* స్వయం ఉపాధి చేపట్టేవారు తమ పన్నులకు తామే బాధ్యత వహించాలి. అంతే కాకుండా భవిష్యత్తులో వారికి ఎలాంటి అదనపు లాభాలు కానీ, పింఛన్ పథకాలంటూ కానీ ఉండవు. అందువల్ల వారు తమ భవిష్యత్తు అవసరాల నిమిత్తం ఎక్కువ పొదుపు చేయాల్సి ఉంటుంది. లేదా ఏదైనా బీమా సంస్థ పింఛన్ పథకంలో చేరాల్సి ఉంటుంది.



**స్వయం ఉపాధి రకాలు:**
మన దేశంలో అనేక రకాల స్వయం ఉపాధులున్నాయి. స్థిర పెట్టుబడి ఆధారంగా వాటిని పలు రకాలుగా వర్గీకరించవచ్చు. ఈ పెట్టుబడి పని విధానం, లేదా ఆ పనిని చేపట్టే ప్రదేశాన్ని బట్టి ప్లాంట్ కోసం లేదా యంత్రాల కోసం కావచ్చు. స్వయం ఉపాధి చేపట్టగలిగిన పలు రంగాలు:

* చిన్న తరహా పరిశ్రమలు
* అతి చిన్న పరిశ్రమలు
* అనుబంధ పారిశ్రామిక కార్యకలాపాలు
* గ్రామీణ పరిశ్రమలు
* కుటీర పరిశ్రమలు
* సూక్ష్మ వ్యాపార సంస్థలు
* చిన్నస్థాయి సేవలు, వ్యాపారాలు (పరిశ్రమలకు సంబంధించినవి)
* వాణిజ్య యూనిట్లు

**స్వయం ఉపాధి ప్రాముఖ్యత:** దీని వల్ల అతడు/ఆమె తన సొంత జీవనోపాధిని స్థాపించుకోవడం సాధ్యపడుతుంది. దీని వల్ల కొన్నిసార్లు ఇతరులకూ ఉపాధి లభిస్తుంది. భారతదేశంలో నిరుద్యోగం పెరిగిపోయి, అవకాశాలు తగ్గిపోతున్న నేపథ్యంలో, స్వయం ఉపాధి అన్నది చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది. దాని ప్రాముఖ్యతను ఈ క్రింది అంశాల ద్వారా విశదీకరించవచ్చు.

**స్వయం ఉపాధి వల్ల లాభాలు:** దీనిని సులభంగా ప్రారంభించవచ్చు. దీనికి చాలా తక్కువ పెట్టుబడి అవసరం. భారీ స్థాయి వ్యాపారాలలో ఎక్కువ పర్యావరణ కాలుష్యం, మురికివాడలు పెరిగిపోవడం, పనివాళ్ల దోపిడీలాంటి వాటి కారణంగా వాటికి స్వయం ఉపాధి ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది.

**వేతన ఉపాధికన్నా ప్రాధాన్యత:** వేతన ఉపాధిలోలాగా దీనిలో ఆదాయానికి పరిమితి అంటూ ఉండదు. ఇక్కడ నిర్ణయాలు తీసుకోవడం వేగంగా జరుగుతుంది. వేతన ఉపాధితో పోలిస్తే, ఇది స్వయం ఉపాధి చేపట్టేవారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**స్వయం ఉపాధికి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు మధ్య తేడాలు:** స్వయం ఉపాధిలో ఎలాంటి రిస్కూ ఉండదు లేదా తక్కువ రిస్కుంటుంది. ఎప్పుడైతే స్వయం ఉపాధి చేపట్టేవారు సరికొత్త ఆలోచనలతో తమ వ్యాపారాన్ని విస్తరించడానికి నిర్ణయించుకుంటారో, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రారంభించేందుకు అది ఒక వేదికగా ఉపయోగపడుతుంది. సరికొత్త ఉత్పత్తులు, ఉత్పత్తిలో కొత్త విధానాలు, మార్కెటింగ్ విధానాలు ఆవిష్కరించడానికి ప్రయత్నించడం, దానికి ఎక్కువ పెట్టుబడి అవసరం ఉండడం వల్ల ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో చాలా రిస్కుంటుంది.

**వ్యక్తిగత సేవలకు ప్రోత్సాహం:** దీనిలో వ్యక్తిగత సేవలైన టైలరింగ్, రిపేర్ పనులు, మందుల సరఫరాలాంటి వ్యక్తిగత సేవలు అందిస్తారు. ఇలాంటి సేవల వల్ల వినియోగదారులకు సంతృప్తి లభిస్తుంది. వీటిని ప్రారంభించడం, ఆ తర్వాత నిర్వహించుకోవడం చాలా సులభం.

**సృజనాత్మకతకు అవకాశం:** స్వయం ఉపాధి వల్ల చేతివృత్తుల రంగంలో సృజనాత్మకతకు, కళాకారుల్లో నైపుణ్యత పెంపుకు ఆస్కారం ఉంది. దీని వల్ల దేశ సంస్కృతిని పరిరక్షించడం సాధ్యపడుతుంది. ఉదాహరణకు హస్తకళల్లో, చేతివృత్తుల ఉత్పత్తుల్లో కళాకారుల సృజనాత్మక ఆలోచనలు ప్రతిఫలిస్తాయి.

**స్వయం ఉపాధి ద్వారా నిరుద్యోగం తగ్గుముఖం:** అనేక మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి వల్ల ఉపాధి లభిస్తుంవది. తద్వారా నిరుద్యోగం తగ్గుముఖం పడుతుంది.

**స్వయం ఉపాధి ఒక వరం:** ఆదాయ పరిమితులు లేదా కుటుంబ సమస్యల కారణంగా ప్రతి ఒక్కరూ సెకండరీ విద్య లేదా ఇంటర్మీడియట్ విద్య తర్వాత పై చదువులు చదివేందుకు అవకాశం ఉండదు. అలాంటి వ్యక్తులు ఎలాంటి పై చదువులూ అవసరం లేని స్వయం ఉపాధిని చేపట్టవచ్చు.

ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలలో ఇటీవలి కాలంలో స్వయం ఉపాధికి పెద్ద పీట వేయడాన్ని కూడా మనం గమనించవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా మరియు దేశవ్యాప్తంగా స్వయం ఉపాధిని, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారు.

**స్వయం ఉపాధి పరిధి:** ప్రభుత్వ పథకాల ద్వారా ఉత్పాదక స్వయం ఉపాధికి ఆర్థిక మరియు ఇతర సహాయాన్ని అందిస్తారు. దీని వల్ల ఇతర అనుబంధ వేతన ఉపాధి కూడా లభిస్తుంది.

ఈ పథకాలను మార్పు చేయడం లేదా ఒకదానిలో ఒకటి కలిపేసి ఏదో ఒక రూపంలో కొనసాగిస్తున్నారు. కొన్ని కొత్త పథకాలను ప్రారంభించగా, మరికొన్ని పథకాలను నిలిపివేశారు.

**అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెరుగుతున్న స్వయం ఉపాధి:**
"IZA వరల్డ్ ఆఫ్ లేబర్ ఆర్గనైజేషన్" ప్రకారం, అభివృద్ధి చెందుతున్న దేశాలలో స్వయం ఉపాధి క్రమంగా పెరుగుతూ పోతోంది. వీరు 18

దేశాలలో స్వయం ఉపాధి మీద సర్వే నిర్వహించారు. ఈ పరిశోధన ప్రకారం, పేదలలో చాలా మంది ఇప్పుడు స్వయం ఉపాధిని చేపడుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వీరు వ్యవసాయ రంగం నుంచి బయటకు వచ్చేసి వ్యక్తిగతంగా లేదా ఇంటి వద్దే స్వయం ఉపాధి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇతరులను నియమించుకోకుండా స్వయం ఉపాధిని చేపట్టేవారిని కొన్నిసార్లు, 'సొంత జవాబుదారీ పనివాళ్లు' అని పిలుస్తారు.

ఇలా చూస్తే, తక్కువ ఆదాయ దేశాలలో (53%) సగానికి పైగా మరియు తక్కువ-మధ్యస్థ ఆదాయ దేశాలలో (36%) మూడో వంతు మంది స్వయం ఉపాధి ద్వారానే జీవిస్తున్నారు. దక్షిణాసియా మరియు సబ్-సహారా ఆఫ్రికా దేశాలలో స్వయం ఉపాధిని చేపట్టిన వారి సంఖ్య చాలా ఎక్కువ. దక్షిణాఫ్రికాలో 19% మంది ప్రజలు స్వయం ఉపాధే చేపట్టారు. పట్టణ ప్రాంతాలలోని నిరుపేదలలో సగం మంది వ్యవసాయేతర వాణిజ్య రంగంలోనే ఉన్నారు.




**స్వయం ఉపాధి మాడ్యూల్:**

మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక స్వయం ఉపాధి పథకాలను ప్రారంభించాయి. దేశంలో అనేక సంస్థలు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడానికి పని చేస్తున్నాయి.

స్వయం ఉపాధి చేపట్టేవారికి అనేక వ్యాపారావకాశాలు లభిస్తాయి. వారికి మార్కెట్ విస్తరించుకునే సామర్థ్యం కూడా ఉంటుంది. వివిధ పథకాల కింద ఏదైనా చిన్న వ్యాపారాన్ని ప్రారంభించేందుకు స్వయం ఉపాధిదారులు పలు రకాల శిక్షణలు పొందే అవకాశముంది.

ఇలా 300కు పైగా రకాల శిక్షణలు అందిస్తున్నారు. 100కు పైగా సంస్థలు ఈ దిశగా పని చేస్తున్నాయి.




**భారతదేశంలో స్వయం ఉపాధికి ప్రోత్సాహం:**

మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా స్వయం ఉపాధిని ప్రోత్సహించడం జరుగుతోంది. ప్రపంచంలోనే మన దేశం జనాభాపరంగా రెండో స్థానంలో ఉంది. ఈ జనాభా కారణంగా మరియు మరీ ప్రత్యేకించి సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ నేపథ్యంలో చేపట్టిన సంస్కరణల కారణంగా మన దేశం నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోంది. ఐదవ పంచవర్ష ప్రణాళిక (1974-79) కాలంలో దేశంలో నిరుద్యోగాన్ని తగ్గించేందుకు ఉపాధిని పెంచే రంగాలకు ప్రాధాన్యతనివ్వాలని, అభివృద్ధిని పెంచే దిశగా విధానాలను రూపొందించాలని నిర్ణయించారు. అదే సమయంలో కేవలం అభివృద్ధి మాత్రమే పేదరిక, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించజాలదనే ఒక అభిప్రాయం బలపడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి (TRYSEM), విద్యాధిక నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకం (SEEUY), పట్టణ పేదలకు స్వయం ఉపాధి పథకం (SEPUP), చదువుకున్న నిరుద్యోగుల కోసం ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన (PMRY), స్వర్ణజయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన (SGSRY), పట్టణ స్వయం ఉపాధి పథకం (USEP), సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (IRDP), జవహర్ రోజ్‌గార్ యోజన (JRY), గ్రామీణ ప్రాంతాలలో మహిళలు, శిశువుల అభివృద్ధి (DWCRA) లాంటి అనేక స్వయం ఉపాధి మరియు పేదరిక నిర్మూలన కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను అనేక శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించాయి. ఇలాంటి సంస్థలలో శిక్షణ పొందుతున్న యువత స్వయం ఉపాధిని చేపట్టడం లేదా ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారడం జరుగుతోంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ గ్రామీణ యువతకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అందించి వారిని ఎంటర్‌ప్రెన్యూర్లుగా రూపుదిద్దడం కోసం దేశంలోని దాదాపు అన్ని జిల్లాలలో పటిష్టమైన మౌలిక సదుపాయ వసతులు కలిగిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల (RSETI)ను నెలకొల్పింది. స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ (SRTRI), జంటనగరాలలో ఉపాధి కల్పన మరియు ప్రోత్సాహక సొసైటీ(SETWIN)లాంటి సంస్థలు కూడా యువతకు స్వయం ఉపాధిపై శిక్షణ ఇవ్వడంలో పాలు పంచుకుంటున్నాయి.

**RSETI లక్ష్యాలు:**

* స్వయం ఉపాధిపై శిక్షణ ఇచ్చేందుకు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న యువకులను గుర్తిస్తారు.

* యువతకు ఇచ్చే శిక్షణ డిమాండ్‌కు తగినట్లుగా ఉంటాయి.

* అభ్యర్థి ఆసక్తి మరియు వారి స్వభావానికి అనుగుణంగా శిక్షణను



ఇవ్వడం జరుగుతుంది.

* బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు అభ్యర్థులకు సహకరించడం జరుగుతుంది.

* స్వయం ఉపాధి మరియు సూక్ష్మ పరిశ్రమల శిక్షణార్థులకు రెండేళ్ల పాటు తోడుగా నిలబడడం జరుగుతుంది.

* శిక్షణ సందర్భంగా అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి ఏర్పాట్లు కల్పించడబడతాయి.

**స్వయం ఉపాధిపై విధానాలు:**

భారత ప్రభుత్వం పట్టణాలలో పేదరికాన్ని నిర్మూలించడానికి జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్(NULM)ను ప్రారంభించింది. అంతేకాకుండా 2013లో ప్రభుత్వం NRLM కింద స్వయం ఉపాధి కార్యక్రమం (SEP)ని ప్రారంభించారు. ఈ పథకం కింద పట్టణంలోని పేదలు లేదా బృందాలకు లాభదాయకమైన స్వయం ఉపాధి పనులు కల్పించడం, సూక్ష్మ పరిశ్రమల స్థాపన కోసం ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతుంది. ఈ దిశగా వ్యక్తులు మరియు బృందాలకు నైపుణ్యాలు, సామర్థ్యాలు మరియు స్థానిక పరిస్థితులపై శిక్షణను అందివ్వడం జరుగుతుంది. అంతేకాకుండా పట్టణాలలో పేద స్వయం సహాయక బృందాలు బ్యాంకుల నుంచి సులభంగా రుణం పొందేందుకు, స్వయం సహాయక సంఘాల రుణాలపై వడ్డీ సబ్సిడీ పొందేందుకు సహకరిస్తాయి.

కేంద్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణాభివృద్ధి మిషన్ కింద తేనెటీగల పెంపకం, కోళ్ల పెంపకం లాంటి ప్రత్యామ్నాయ అవకాశాలపై రైతులకు శిక్షణ ఇచ్చేందుకు కృషి విజ్ఞాన కేంద్రాలు (KVK), కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ వర్సిటీలతో టైఅప్‌లు పెట్టుకోవాలని యోచిస్తున్నాయి. అంతే కాకుండా స్వయం ఉపాధి కల్పనకు ప్రస్తుతం ఉన్న పథకాల లక్ష్యాలతోనే మరింత కట్టుదిట్టమైన వ్యవస్థతో కొత్త పథకాలను ప్రారంభించేందుకు కృషి చేస్తున్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (DDUGKY)లాంటి పథకాల ద్వారా పొందిన అనుభవంతో కొత్త పథకాలను తయారు చేయాలని యోచిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. పూర్తిస్థాయి ఉపాధి జీవనోపాధుల ప్రాజెక్టు (LIFE), గ్రామీణ తాపీ పనివారి కార్యక్రమం, మట్టికాళ్ల (బేర్‌ఫుట్) సాంకేతిక నిపుణుల కార్యక్రమం ఇలాంటి కార్యక్రమాలలో కొన్ని.

ప్రస్తుతం ఉన్న అన్ని పథకాలలో నాణ్యతకు, సర్టిఫికేషన్‌కు సంబంధించి పలు సమస్యలున్న నేపథ్యంలో స్వయం ఉపాధిని పెంచేందుకు కొత్త పథకాల ద్వారా గ్రామీణ యువతపై దృష్టిని కేంద్రీకరించడం జరుగుతోంది. ఈ పథకాల ద్వారా గ్రామీణ యువత, గ్రామీణాభివృద్ధికి, శ్రేయస్సుకు తోడ్పడి, తద్వారా వారి ఆర్థిక సమస్యలు తొలగిపోతాయని ఆశిస్తున్నారు.

**స్వయం ఉపాధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర:**

భారతదేశంలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో బహుళ జాతి కంపెనీలు స్థానిక ప్రజల అభివృద్ధిలో పాలు పంచుకోవాలి. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కింద అనేక సంస్థలు యువత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో పాలు పంచుకుంటున్నాయి. ఇవి గ్రామీణ యువతకు శిక్షణను అందిస్తున్నాయి. ఆ తర్వాత ఈ సంస్థలు స్వయం ఉపాధి కార్యకలాపాలు ప్రారంభించాలనుకుంటున్న వారికి సహకారాన్ని అందిస్తాయి.

GMR ఫౌండేషన్, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, స్వయం ఉపాధి మహిళల సంస్థ (SEWA), గ్రామీణాభివృద్ధి కొరకు గిరిజన సహకార సంస్థ (TRICORD), COVA ఇతర సంస్థలు ఈ దిశగా పని చేస్తున్నాయి.

స్వయం ఉపాధి పొందాలనుకుంటున్న పేదలకు సహకరించేందుకు ఇలా ఎన్నో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు పని చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనేక మంది పేదలు స్వయం ఉపాధిని ఎంపిక చేసుకుంటున్నారు.



అలాంటి వారిని గుర్తించి, వారికి తగిన నైపుణ్యాలు, ముడిపదార్థాలు, రుణ సదుపాయం లభించేలా చూడడం ద్వారా వారికి ఎంతో సాయం అందించినట్లవుతుంది.

అలా స్వయం ఉపాధి పొందినవారు గొలుసుకట్టుగా మరి కొంతమందికి ఉపాధి చూపించే అవకాశముంది. ఇలా అనేక సంస్థలు నైపుణ్యాలు, ఇతర సామర్థ్యాలు అందించడంలో స్వయం ఉపాధిని ఎంపిక చేసుకునే వారి సంఖ్యను పెంచడంలో దోహదపడుతున్నాయి.

**మహిళా, పురుష కార్మికులలో స్వయం ఉపాధి తేడాలు (2009-10):**

ఇటీవలి కాలంలో స్వయం ఉపాధిని చేపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అంతే కాకుండా వేతన ఉపాధిని పొందడంలో ఉన్న సమస్యల కారణంగా స్వయం ఉపాధిని ఎంపిక చేసుకుంటున్న మహిళా, పురుష కార్మికుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

2004-05లో వేతన ఉపాధితో పోలిస్తే స్వయం ఉపాధి రంగంలోని వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో స్వయం ఉపాధిలో మహిళా, పురుష కార్మికుల సంఖ్య కూడా పెరిగింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ సంఖ్యలో పురుషులకన్నా మహిళల సంఖ్యే ఎక్కువగా ఉంది. అయితే రోజువారీ కూలీల విషయంలో 2009-10 కాలంలో గ్రామీణ మహిళలు, పురుషుల సంఖ్య నిష్పత్తి కూడా పెరిగింది.

**2012 నాటికి భారతదేశంలో స్వయం ఉపాధి పరిస్థితి:**

జాతీయ సాంపిల్ సర్వే కార్యాలయం (NSSO) సర్వే ప్రకారం, దేశంలోని సుమారు 51% మంది కార్మికులు స్వయం ఉపాధి ద్వారా జీవిస్తున్నారు. వీరిలో 33.5 % మంది రోజువారీ కూలీలుగా, 15.6% మంది వేతన ఉపాధి పొందుతున్నారు. పట్టణ ప్రాంతాలలో 41.1% స్వయం ఉపాధి పొందుతుండగా గ్రామీణ ప్రాంతాలలో వీరి సంఖ్య 54.2% ఉంది. పట్టణ ప్రాంతాలలో రోజువారీ కూలీల శాతం 17.5 % ఉండగా, గ్రామీణ ప్రాంతాలలో ఇది 38.6% ఉంది. ఈ సర్వేను జులై, 2012లో నిర్వహించడం జరిగింది.

ప్రభుత్వం విడుదల చేసిన ఒక సర్వే వివరాల ప్రకారం, దేశంలో స్వయం ఉపాధి చేపట్టే వారి సంఖ్య 2004-05, 2011-12 మధ్య కాలంలో తగ్గింది. ఈ కాలంలో దేశవ్యాప్తంగా స్వయం ఉపాధి చేపట్టే వారి సంఖ్యలో తరుగుదలను గుర్తించారు. సర్వేను నిర్వహించిన పట్టణాలలో భోపాల్, నాగ్‌పూర్, ఆగ్రా ఇతర ప్రధాన పట్టణాలున్నాయి.

మన దేశంలో అసంఘటిత రంగంలో కార్మికులుగా ఉన్నవారు స్వయం ఉపాధిని ఎంపిక చేసుకుంటున్నారు. దీనికి తోడు, కుటుంబ నిర్వహణ కింద ఉండే దుకాణాలు, పరిమిత సొమ్ముతో వస్తువులను కొనుగోలు చేసి వీధుల్లో విక్రయించే వీధి వర్తకులు కూడా స్వయం ఉపాధి కిందికే వస్తారు. వీరు ఎవరి యాజమాన్యం కిందా పని చేయరు. వీరికి కొంత ఆర్థిక సహకారం, మార్కెటింగ్ నైపుణ్యాలు అవసరం. వీరు తమ ఉత్పత్తులను వీధుల్లోను, బస్ స్టాపుల్లోను, ఇతర బహిరంగ ప్రదేశాలలో విక్రయిస్తారు.

**లోటుపాట్లు, అంతరాలు:**

అభివృద్ధి చెందుతున్న దేశాలలో స్వయం ఉపాధిపై ఉన్న అపోహల కారణంగా ఎక్కువ మంది స్వయం ఉపాధికన్నా, వేతన ఉపాధినే కోరుకుంటున్నారు. అయితే తమకు తామే యజమానులు ఉండడం, పని, కుటుంబ బాధ్యతల మధ్య సర్దుబాటు చేసుకునే వెసులుబాటు కారణంగా అనేక మంది స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపుతున్నారు.

అంతేకాకుండా, పోల్చి చూస్తే, వేతన ఉపాధి కన్నా స్వయం ఉపాధి ద్వారానే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించగలుగుతున్నారు. అయితే అదే సమయంలో స్వయం ఉపాధిలో చిక్కులు, సమస్యలు కూడా అదే పరిమాణంలో ఉన్నాయి. స్వయం ఉపాధిదారుల మరో సమస్య సామాజిక, ధరల లాభాల్లో తేడాలు. మొత్తంగా చూస్తే మన దేశంలో అనేక మంది స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపుతున్న దృశ్యం కనిపిస్తుంది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా కూడా అనేక మంది స్వయం ఉపాధినే ఎంపిక చేసుకుంటున్నారు.

**ముగింపు:**

స్వయం ఉపాధి నేపథ్యంలో భారతదేశం నిరుద్యోగం, తక్కువ ఉద్యోగాలు అన్న సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. వాస్తవం ఏమిటంటే, దేశంలో అభివృద్ధి రేటు పెరిగినా, దానికి తగినట్లుగా ఉపాధి అవకాశాలు మాత్రం పెరగలేదు. నిజానికి ఒకవైపు అభివృద్ధి రేటు పెరుగుతుండగా, మరో వైపు ఉపాధి అభివృద్ధి రేటులో తరుగుదల ఉంది. అనేక మంది ఆర్థికవేత్తలు, ఇతరులు దీనిని 'ఉపాధిలేని అభివృద్ధి' గా పేర్కొంటున్నారు. దేశంలో కనిపిస్తున్న వైరుధ్యం ఏమిటంటే – ఒకవైపు కొన్ని ఉద్యోగాలకు తగిన అభ్యర్థులు లభించడం లేని పరిస్థితి, మరోవైపు ఉన్న వారికి తగిన అవకాశాలు లేని పరిస్థితి. ప్రపంచంలోని పేదలలో నేడు ఎక్కువ మంది పేదరిక కబంధాల నుంచి బయట పడేందుకు స్వయం ఉపాధిని ఎంపిక చేసుకుంటున్నారు. స్వయం ఉపాధిని చేపట్టేవారు జీవనం కొరకు మరింత ఎక్కువగా కష్టపడాల్సి వస్తున్నా సురక్షితమైన వేతన ఉపాధిని పొందే వారితో పోలిస్తే సమాజం వారిని చిన్నచూపు చూస్తోంది. పేద ప్రజలు గౌరవంతో జీవించేందుకు, స్వయం ఉపాధిని ఒక ముఖ్యమైన జీవనోపాధిగా చూడాల్సిన అవసరముంది. వారికి తగిన సహకారం అందించి, వారిని గౌరవంగా చూడాల్సిన అవసరముంది. అప్పుడే స్వయం ఉపాధి ద్వారా పేదరికం నుంచి బయటపడడం సాధ్యం. *



సందర్భం

# బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) చట్టం

బ్యూరో ఆఫ్ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) అన్నది ఒక జాతీయ నాణ్యతా సంస్థ. ఇది భారత ప్రభుత్వానికి చెందిన వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా సరఫరా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తుంది. ఇది BIS చట్టం, 1986 ద్వారా 1986, డిసెంబర్ 23 నుంచి అమలులోకి వచ్చింది.

ఈ సంస్థను గతంలో ఇండియన్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూట్ (ISI) అనేవారు. ఇది పరిశ్రమలు మరియు సరఫరాల విభాగం 3 సెప్టెంబర్, 1946న జారీ చేసిన నెం.1 Std (4)/45 తీర్మానం ద్వారా ఏర్పాటైంది. ISI సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం, 1860 కింద రిజిస్టర్ చేయబడింది.

IBIS అంతర్జాతీయ నాణ్యతా సంస్థ (ISO) వ్యవస్థాపక సభ్యుల్లో ఒకటి. ఇది ISOతో పాటు, అంతర్జాతీయ ఎలెక్ట్రో టెక్నికల్ కమిషన్ (IEC), ప్రపంచ నాణ్యతా సేవల నెట్‌వర్క్ (WSSN)లలో భారతదేశ ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. దీని ప్రధాన కర్తవ్యం భారతదేశ:లో ప్రమాణాలను రూపొందించి, గుర్తించి, వాటిని ప్రోత్సహించడం. 2013, ఆగస్టు 31 నాటికి సుమారు 19067 నాణ్యతలను రూపొందించడం జరిగింది. దీని వల్ల పరిశ్రమలు తమ ఉత్పత్తులు, సేవల నాణ్యతను మెరుగు పర్చుకోవడానికి వీలవుతుంది. ఈ నాణ్యతలను క్రమం తప్పకుండా సమీక్షించి అవి సాంకేతికాభివృద్ధికి, అంతర్జాతీయ ప్రమాణాలకు ఉండేట్లు అనుగుణంగా ఉండేట్లు రూపొందించడం జరుగుతుంది. రసాయన, ఆహార, ఎలెక్ట్రికల్, మెకానికల్ ఉత్పత్తుల సర్టిఫికేషన్ కొరకు దేశవ్యాప్తంగా ఎనిమిది లేబరేటరీలను నెలకొల్పడం జరిగింది. ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన ఉత్పత్తుల విషయానికి వస్తే, ఉదా: పాల పౌడర్, తాగునీరు, ఎల్‌పీజీ సిలిండర్లు, థర్మామీటర్లు మొద. సర్టిఫికేషన్ అన్నది తప్పనిసరి. అయితే మిగిలిన ఉత్పత్తుల విషయానికి వస్తే సర్టిఫికేషన్ అన్నది ఐచ్ఛికం. విదేశీ ఉత్పత్తిదారులు BIS ఉత్పత్తి సర్టిఫికేషన్ తీసుకోవడం తప్పనిసరి.

2015, జూన్ 17న కేంద్ర కేబినెట్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ బిల్లు (2015)ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. ఆ బిల్లుకు లోక్‌సభ 2015, డిసెంబర్ 3న, రాజ్యసభ 2016 మార్చి 8న ఆమోదం తెలిపాయి. ఆ కొత్త బిల్లు అప్పటికే ఉన్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చట్టం, 1986ను రద్దు చేసింది.

ప్రతిపాదించిన చట్టం యొక్క ప్రధాన లక్ష్యాలలో – BISను జాతీయ నాణ్యతా సంస్థగా నెలకొల్పడం; అధ్యక్షుడు మరియు ఇతర సభ్యులు కలిగిన ఒక గవర్నింగ్ కౌన్సిల్ ద్వారా బ్యూరో తన కార్యకలాపాలు నిర్వహించేలా చేయడం; ఆరోగ్యం, భద్రత, పర్యావరణం, మోసపూరిత కార్యకలాపాల నివారణ, వినియోగదారుల భద్రత మొదలైన వాటి దృష్టి కోణం నుంచి వస్తువులు, సేవలు, విధానాలను నాణ్యతా ప్రమాణాల పరిధిలోకి తీసుకురావడం; వస్తువులు, సేవలు, విధానాలకు సర్టిఫికేషన్‌ను తప్పనిసరి చేసేందుకు ప్రభుత్వానికి అవకాశం కల్పించడం; దీని వల్ల వినియోగదారులు ISI సర్టిఫికేషన్ ఉన్న వస్తువులను కొనుగోలు చేయడానికి; తక్కువ ప్రమాణాలు కలిగిన వస్తువులను నివారించడానికి; నాణ్యత విషయంలో సంస్థలు తామే సొంతంగా సెల్ఫ్–డిక్లరేషన్ చేసేందుకు, తద్వారా ఉత్పత్తిదారులకు నాణ్యతా ప్రమాణాల విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలు లభించి సర్టిఫికేషన్ ఆఫ్ కన్‌ఫర్మిటీ పొందడం సులభతరం చేయడం వీలవుతుంది. తద్వారా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మెరుగుపడి కేంద్ర ప్రభుత్వం BISకు అదనంగా సేవలు, వస్తువుల నాణ్యతను నిర్ధారించేందుకు మరో అధికారిక సంస్థను ఏర్పాటు చేసేందుకు అవకాశం కలుగుతుంది; విలువైన లోహపు వస్తువుల విషయంలో తప్పనిసరిగా 'హాల్ మార్కింగ్' చేయాల్సి వస్తుంది. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండేలా చట్టపరమైన నిబంధలను మరింత కఠినతరం చేయడం; ఉల్లంఘనకు పాల్పడినపుడు ఆ నేరాలకు రాజీకి తగినవిగా మార్చడం; నాణ్యతా గుర్తింపు కలిగి భారతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉత్పత్తులు, సేవల విషయంలో వాటిని వెనక్కి తీసుకునే అవకాశాన్ని కల్పించడం; BIS చట్టం, 1986ను రద్దు చేయడం ఈ చట్టం ద్వారా వీలవుతుంది.

ఈ చట్టానికి ముందు నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎలాంటి పారదర్శకతా ఉండేది కాదు. అంతే కాకుండా ఈ చట్టం ద్వారా ఇంకా అనేక ఉత్పత్తులను ఉదా: నగలు వంటి వాటిని కూడా నాణ్యతా ప్రమాణాల పరిధిలోకి రావడం తప్పనిసరి చేశారు. లోహపు పదార్థాలను 'హాల్ మార్కింగ్' చేయడం తప్పనిసరి చేశారు. నాణ్యతా ప్రమాణాల పరిధిని విస్తృతం చేసి, శిక్షలను పెంచి, నేరాలను రాజీపడదగినవిగా చేసి, చట్టంలోని కొన్ని అంశాలను సరళీకరించడం జరిగింది. మొత్తంగా చూస్తే, వస్తువులు, సేవల నాణ్యతను మెరుగుపరిచే సంస్కృతిని పెంపొందించి, అవి తప్పనిసరిగా భారతీయ నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండేట్లుగా చేయడం ఈ చట్టం లక్ష్యం. ✸

# భారతమాత వృద్ధుల సమాఖ్య

**భా**రతమాత వృద్ధుల సమాఖ్య (BMEF)ను 15 జనవరి, 2007న 7 వృద్ధుల స్వయం సహాయక సంఘాల(ESHGs)చే ఎన్నుకోబడిన ప్రతినిధులతో ఏర్పాటు చేయడమైనది. ఇది పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కుచ్‌బిహార్ జిల్లాలో ఏర్పాటు చేయబడింది. ఈ BMEF వృద్ధులను ఆర్థికంగా, మానసికంగా బలోపేతం చేసేందుకు కృషిచేస్తుంది. ఈ BMEFలో 7 ESHGలచే మొదలై ఇప్పుడు 65 ESHGలకు చేరుకుంది. దీనికి 'హెల్పేజ్ ఇండియా' సంస్థ సహాయ సహకారాలను అందిస్తుంది.

ఈ BMEF మొదట్లో వృద్ధులను నెలకు రూ.2/-ల చొప్పున పొదుపు చేసుకునేలా ప్రోత్సహించింది. BMEF, ESHG సమావేశాలు జరిగేలా చూడటం, మెడికల్ క్యాంపులు, కంటి ఆపరేషన్లు (శుక్లాలు) చేయించడం వంటివి చేస్తుంది. దీనికి హెల్పేజ్ ఇండియా వారు రూ.60,000ల ఆర్థిక సహాయం (గ్రాంట్) చేసింది. వాటిని వారి జీవనోపాధుల కార్యక్రమాలకు ఉపయోగించుకుంటున్నారు. ఆ తరువాత ESHG సభ్యులు తమ పొదుపులు రూ.30-50ల మధ్యకు పెంచుకొని పొదుపు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఈ సమాఖ్య పరిధిలో ఉన్న సంఘాల మొత్తం పొదుపు రూ.1,07,508లు ఉండగా, వారికి అప్పు రూపంలో రూ.2,01,850లు పొందింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధుల మిషన్ (WBSRLM) పైలెట్ ప్రాజెక్టుగా దినహత్, కుచ్‌బిహార్‌లో ఉన్న ESHGలకు సాంకేతిక సహాయం అందిస్తుంది. వృద్ధులు అప్పులను తీసుకొని నూనె వ్యాపారం చేయడం ప్రారంభించారు. ఇటీవల ఈ సమాఖ్య పరిధిలో మరో 5 గ్రామైక్య సంఘాలు ఏర్పాటు చేయడమైనది.

2015లో BMEF ఆధ్వర్యంలో క్రిస్టమస్ రోజున 200 మీటర్ల రోడ్డు గుంతలను పూడ్చటం జరిగింది. ఈ కార్యక్రమంలో 38 వృద్ధులు, స్థానిక వృద్ధులు కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమం వల్ల ప్రజలకు రోడ్డు అందుబాటులోకి వచ్చింది. ఈ రోడ్డును గ్రామానికి కానుకగా ఇవ్వడం వల్ల BMEF స్థానిక గ్రామంలో మంచి పేరును తెచ్చుకుంది.

WBSRLMచే ప్రతిష్ట అను వృద్ధుల ఆర్థిక సమ్మిళిత కార్యక్రమానికిగాను, BMEF ఆధ్వర్యంలో వృద్ధులను క్షేత్ర సందర్శన కొరకు ప్రక్క బ్లాక్‌కు తీసుకెళ్ళడం జరిగింది. ఈ సమాఖ్య నుండి వృద్ధుల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (ECRP)లను దిన్‌హత్ బ్లాక్-I కు పంపగా 38 ESHGలను ఏర్పాటు చేయడమైనది. ✷



# లోహర్‌దగ గ్రామ్ స్వరాజ్య సంస్థాన్

**లో**హర్‌దగ గ్రామ్ స్వరాజ్య సంస్థాన్ (LGSS) లాభాపేక్షలేని సంస్థను 1985లో ఏర్పాటుచేశారు. ఇది ఇండియన్ ట్రస్ట్ యాక్ట్ 1882 క్రింద రిజిస్టర్ చేయబడింది. LGSS గ్రామీణ గిరిజన పేద ప్రజలకై కృషిచేస్తూ పేదలు తమకు ఉన్నటువంటి వనరులను ఉపయోగించుకొనేలా గ్రామీణ స్వయం సంవృద్ధిగల సమాజాలను తయారుచేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది.

ఈ LGSS జార్ఖండ్ రాష్ట్రంలో 7 జిల్లాలలోని నిస్సహాయ గిరిజన సమూహ ప్రాంతాలలో పనిచేస్తుంది. ఆ జిల్లాలు: లోహర్‌దగ, గుమ్లా, సెమ్‌దేగా, రాంచి, కుంటి, పాలము మరియు లటెహర్. ఈ LGSS బెంగుళూర్ కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్ ఫోరం సహాయంతో సమాజ ఆధారిత పునరావాస కార్యక్రమంను నిర్వహిస్తుంది. ఇది వికలాంగుల సాధికారత లక్ష్యంగా, వారికి విద్య, వైద్య, ఉపాధికి సదుపాయాలను లోహర్‌దగ జిల్లాలోని 353 గ్రామాలలో కల్పిస్తుంది. LGSS, 1097 వికలాంగులతో వికలాంగుల సంఘాలను ఏర్పాటుచేసింది. అవి గ్రామాలు మొదలుకొని జిల్లాల సంఘాల వరకు ఉన్నాయి. అవి గ్రామస్థాయిలో 84, గ్రామపంచాయతీ స్థాయిలో 19, బ్లాక్ స్థాయిలో 7 మరియు జిల్లా స్థాయిలో స్వావలంభ్ వికాలంగ్ మహాసంఘ్‌లు కలవు. LGSS సంస్థ హెల్పేజ్ ఇండియా సహాయ సహకారంతో ప్రాజెక్ట్ అస్థిత్వ చేపట్టడం జరిగింది. ఈ ప్రాజెక్టులో భాగంగా కైరో బ్లాక్‌లోని 850 వృద్ధులు (450 పురుషులు, 400 స్త్రీలు) సంరక్షణ బాధ్యతలను తీసుకుంది. ఇప్పటివరకు 50 వృద్ధుల స్వయం సహాయక సంఘాల(ESHG)ను లోహర్‌దగ జిల్లాలో ఏర్పాటుచేయడం జరిగింది. ఈ LGSS వృద్ధులకు సంబంధించిన పలురకాలైన కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ముఖ్యంగా వైద్య శిబిరాలు, కంటి ఆపరేషన్‌లు, వృద్ధుల హక్కులకు సంబంధించినవి ఉన్నాయి.

స్థానికంగా ఉండే పౌర సమాజాల ద్వారా అనగా ఎదుకాన్ ఫౌండేషన్, డెవలప్‌మెంట్ ఫోకస్ ఆర్గనైజేషన్ మరియు 1200 వాలంటీరలతో జార్ఖండ్ రాష్ట్రంలో 200 బాల్యవివాహాలను నిలుపుదల చేశారు. అంతేగాకుండా ఈ సంస్థ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో నిధులను పొందుతూ పలురకాలైన కార్యక్రమాలను చేపడుతుంది.

• యూనిసెఫ్ ద్వారా మహిళల ఋతు సమస్యలు మరియు పరిశుభ్రత నిర్వహణకు సహాయం చేస్తుంది. • డామియన్ ఫౌండేషన్ ట్రస్ట్ చెన్నై వారితో కుష్టువ్యాధి నియంత్రణ కార్యక్రమం చేపట్టడం. • నిర్మల్ భారత్ అభియాన్ ద్వారా పారిశుద్ధ్యం నిర్వహించడం. • ప్రథమ్ సంస్థ, న్యూఢిల్లీ వారిచే విద్య/అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించటం. • ట్రికిల్-అప్ ప్రోగ్రాం ద్వారా జీవనోపాధులను పెంపొందించే కార్యక్రమం నిర్వహించటం. • నాబార్డ్ క్రింద జాతీయ వనరుల నిర్వహణ ప్రాజెక్టులో భాగంగా మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ద్వారా విత్తన సంరక్షణ కార్యక్రమంను నిర్వహించటం జరిగింది.

మహిళా సాధికారతకుగాను లోహర్‌దగ జిల్లాలో ఇప్పటివరకు 1927 SHGలు ఏర్పడగా, దీనికి నాబార్డ్ సహాయ సహకారాలను అందిస్తుంది. 367 SHGలు ఆదాయం ఉత్పత్తి/పెంపుదల కార్యక్రమాలకుగాను బ్యాంక్ నుండి రుణాలను పొందటం జరిగింది. ఈ విధంగా క్షేత్రస్థాయిలో LGSS బాగా పనిచేస్తూ వృద్ధులు, వికలాంగుల ఆదరాభిమానాలను చూరగొంది. ✷

# జర్దోజి ఎంబ్రాయిడరీ పని



ఉత్తర భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లో మరియు దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో జర్దోజి ఎంబ్రాయిడరీ పని ఉనికిలో ఉంది. ఇది పురాతన నైపుణ్యాలలో ఈ పని ఒకటి. దశాబ్ధాలుగా, ఈ పురాతన నైపుణ్యం అనేది తిరిగి మార్కెట్లోకి తిరిగి వస్తుంది. కారణం, యువతులు, మహిళలు తాజా ఫ్యాషన్లు మరియు ట్రెండులకు అనుగుణంగా ఈ జర్దోజి ఎంబ్రాయిడరీ పని పెరుగుతుంది. ఈ ఎంబ్రాయిడరీ పనిలో బంగారం, వెండి దారాలను ఉపయోగించి విస్తృతమై డిజైన్లను ఉపయోగిస్తున్నారు. ఈ పనికి సమకాలికంగా ముత్యాలు మరియు మెరుపులతో కూడిన రాళ్లను కూడా తోడవ్వడంతో మంచి నైపుణ్యం కలిగిన పనికి ఆదరణ పెరుగుతుంది.

తాజాగా కొత్త కొత్త పోకడలు, ట్రెండ్స్ రావడం వల్ల ఈ పనిలో కొత్త ఆవిష్కరణలు చేయడంతో మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఈ జర్దోజీ ఉత్పత్తులను కొనడానికి యువతులు, మహిళలు దృష్టి పెడుతున్నారు. ఈ రోజుల్లో, పాత నైపుణ్యాన్ని పున:ప్రారంభించి దాని ద్వారా ఆధారపడుతున్న ప్రజలకు ముఖ్యమైన జీవనోపాధిగా మారింది. అంతేగాకుండా, లక్షలాధి యువతులకు, స్త్రీలు మరియు పురుషులకు ఉపాధిని అందిస్తోంది.

ప్రధానంగా, ఈ పని ఇళ్ళల్లో చేసుకొనే జీవనోపాధి. తద్వారా ఇండ్లల్లో ఈ పనిపై పెట్టుబడి పెట్టి, పనిచేయడం ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారు. ఇటీవల కాలంలో, చాలా మంది గృహిణీలు నైపుణ్యం ఉన్న ఈ పనిపై ఆకర్షితులవుతున్నారు. ఈ జర్దోజీ పనులు ప్రత్యక్షంగా, పరోక్షంగా బహుళ జీవనోపాధులను అందిస్తుంది. అవి: వడ్రంగిలకు, బట్టల వ్యాపారులకు, నేత కార్మికులకు, టైలర్లకు, దుకాణ అద్దెలు, ముడిపదార్ధాలు అమ్మేవారికి, ఎంబ్రాయిడరీ వస్తువులు అమ్మేవారికి, మొ.వి.

ఈ పనిని ఒక ఇంట్లో ఏర్పాటు చేయడానికి పెట్టుబడి ఇతర వ్యాపారాలతో పోలిస్తే చాలా తక్కువ. అనగా సుమారు రూ.10,000లు సరిపోతుంది. ఈ పనిచేయడానికి చెక్క ఫ్రేములలో సమర్ధంగా పనిచేసే నైపుణ్యకారులు, సూదులు, బంగారు, వెండి రంగుల దారాలు, హుక్స్, ప్లాస్టిక్ పూసలు, మెటల్ నక్షత్రాలు, చెక్కతో చేసిన గుండ్రని పరికరం (జర్దోజి పనికి), రకరకాల దారాలు మొ.వి. అవసరం. ఈ మొత్తం ప్రక్రియలో నైపుణ్యకారులు తమ కళలను వస్త్రం మీద డిజైన్‌కు అనుగుణంగా నాలుగు మూలలో కూర్చొని పనికి సంబంధించిన సాధానాలతో అల్లిక చేస్తారు.

డిజైన్‌కు అనుగుణంగా, వస్త్రాలపై రంగు రంగు దారాలను సన్నని సూదుల ద్వారా ఉపయోగించుకుంటూ అల్లిక చేస్తారు. అవసరమైన చోట ప్లాస్టిక్ పూసలు, ప్లాస్టిక్ నక్షతాలను అలంకరించడంతో జర్దోజీ పనిపూర్తవుతుంది.

ఈ నైపుణ్యం చాలా కఠినంగా ఉంటుంది. కానీ, ఒకసారి వస్త్రంపై ఈ నైపుణ్యం ద్వారా రకరకాల డిజైన్లను వేసి చేయడంతో దాని విలువ పెరుగుతుంది. అది ఎంతో అందంగా, వస్త్రంపై డిజైన్ కనిపిస్తుంది. ఒక మామూలు వస్త్రం, ఇలా డిజైన్ చేయించడం వల్ల ఆ వస్త్రం విలువ పెరుగుతుంది. ఒక వస్త్రం అల్లికపై నైపుణ్యకారులు సుమారు రూ.500-600లు పొందుతారు.

ఈ పనికి అధిక ఓపిక మరియు ఏకాగ్రత కావాలి. ఎందుకంటే, ఒక వస్త్రంపై మంచి డిజైన్‌వేసి దానికి అనుగుణంగా ఎంబ్రాయిడరీ చేసి, ఒక అందమైన ఉత్పత్తి తేవడానికి ఎంతో కష్టపడాలి. దానివల్లనే చేసిన పనికి విలువ పెరుగుతుంది. ✸

## వ్యాపారం

**వ్యక్తిగత**



వడ్రంగి పనిచేయడం

**సమిష్టి**



SHG ద్వారా కూరగాయల అమ్మకం

## జీవన తంత్రం

# లక్ష్యసిద్ధి



అనగనగా శంఖవరం అనే ఒక ఊరిలో శేషయ్య శాస్త్రి అనే సంగీత విద్వాంసుడు ఉండేవాడు. ఆయన సంగీత కచేరీలతో చుట్టు ప్రక్కల గ్రామాల్లో బాగా ప్రసిద్ధి గాంచారు. ఆయన సంగీత కచేరీలు ఎక్కడ ఏర్పాటు చేసినా పండితుల నుండి పామరుల వరకు అందరూ వచ్చి ఆస్వాదించేవారు. ఆయన సంగీత కచేరీల ఏర్పాటు కోసం ఆ చుట్టు ప్రక్కల ఊళ్ళ నుంచి ఆహ్వానాలు వచ్చేవి. శేషయ్య శాస్త్రి ఎప్పుడూ సంగీత కచేరీలతో శిక్షణ తీరిక లేకుండా ఉండేవారు. అయినా కొద్దిమందికి శిక్షణ ఇచ్చేవారు.

శ్రీధర్ శర్మ అనే ఒక యువకుడు శేషయ్య శాస్త్రి దగ్గర సంగీతం నేర్చుకోవడానికి చేరాడు. ఆధునిక స్వభావం కలిగిన శ్రీధర్ శర్మ ఏపనైనా నిమిషాల మీద అయిపోవాలనుకునేవాడు. ఎంతటి కార్యం అయినా ఇట్టే పూర్తి చేయాలని కలలు కనేవాడు. సంగీత సాధనపై కూడా ఇటువంటి అభిప్రాయమే శ్రీధర్ శర్మకు ఉండేది. వీలైనంత త్వరగా సంగీత పాఠాలు పూర్తి చేసి కచేరీలు ఇవ్వాలని భావించాడు.

మొదటిరోజు సంగీత పాఠశాలకు శ్రీధర్ శర్మ వెళ్ళాడు. సంగీత సాధన చేస్తున్న వారిని కలిశాడు. 'ఇక్కడ సంగీత సాధనకు ఎంతకాలం పడుతుంది' అని వారిని అడిగాడు. 'ఆరు నెలలు సంగీతంలోని ప్రాథమిక అంశాలు నేర్పుతారని, ఆ తర్వాత మరో ఆరు నెలలు సంగీత సాధన చేయాల్సి ఉంటుందని' వారు తెలిపారు. అయితే "నేను ఆరు మాసాలు పూర్తి చేసిన వారితో చేరతాను" అన్నాడు. అలాగే ఆరు మాసాలు సంగీత సాధన పూర్తి చేసిన వారితో కలిసి సంగీత సాధన పూర్తి చేశాడు.

ఆ తరువాత వెంటనే సంగీత కచేరీలు ఇవ్వటం ప్రారంభించాడు. సంగీతంలో అంత పట్టు లేకపోవడంవల్ల అతని కచేరీల్లో ఆ లోటు స్పష్టంగా కనిపించసాగింది. కచేరీలకు వచ్చిన వారు శ్రీధర్ శర్మ మొహం మీదే 'ఇదేం సంగీత కచేరీ' అని విమర్శించసాగారు. ప్రేక్షకుల నుంచి ఇటువంటి విమర్శలు రావటంతో శర్మ ఖంగు తిన్నాడు. వెంటనే గురువు దగ్గరకు వెళ్ళి జరిగినదంతా వివరించాడు. క్షమాపణ కోరాడు. అప్పుడు గురువు 'నడక నేర్వకుండా పరుగు కోసం తాపత్రయ పడితే ఇటువంటి అనుభవాలే ఎదురౌతాయి' అని హితబోధ చేశారు. శ్రీధర్ శర్మ చేసిన తప్పుకు చింతించాడు. అన్నింటికీ దగ్గర దారులు ఉండవని గ్రహించాడు. మళ్ళీ పాఠశాలలో మొదటి నుంచి సంగీత సాధన ప్రారంభించాడు. సంగీతంలో ప్రావీణ్యం సాధించాడు. గురువు గారి ఆశీస్సులు పొందాడు. ఆ విధంగా శర్మ తను అనుకున్న లక్ష్యం నెరవేర్చుకున్నాడు. ✸

## వ్యాపారం

**సామాజిక**



ఉత్తర ప్రదేశ్‌లో సేవంబు స్వచ్ఛంద సంస్థ ద్వారా హెల్త్‌క్యాంపు నిర్వహణ




సెప్టెంబర్ 08,
అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

## పుస్తకాలు

**క్లాసిక్ పుస్తకం**

### ఆన్ లిబర్టీ

రచయిత: జాన్ స్టూవర్ట్ మిల్



ఈ రచయిత 19వ శతాబ్ది బ్రిటీష్ తత్వవేత్త, రాజకీయ ఆర్థికవేత్త, సమాజ సేవకుడు మరియు ఆలోచనాపరుడు. ఈ పుస్తకంను జెరిమా బెంథామ్ వ్రాసిన 'ఆన్ ఎథికల్ థియరీ' మరియు ఉపయోగితావాదము ఆనవాలుగా చెప్పవచ్చు. ఇది మిల్ రచనలలో ప్రసిద్ధమైనది. వ్యక్తి స్వేచ్ఛ సమాజం మరియు రాజ్యంలో ఎలా ఉండాలనే తన ఆలోచనలను ఈ పుస్తకంలో వివరించారు. సమాజ అభివృద్ధి చెందే క్రమంలో దిగువ నుండి ఉన్నత దశకు చేరి, తారాస్థాయికి చేరిన ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావం జరుగుతుంది. అని చెప్పడం జరిగింది. ప్రజాస్వేచ్ఛ పరిమితి కలిగినదై సమాజ అధికారులతో ఉంటూ, ప్రతివ్యక్తికి వర్తించాలి. ఈ స్వేచ్ఛ అనేది 3 రకాలుగా వివరించవచ్చు. అవి: 1. ఆలోచనా మరియు అభిప్రాయస్వేచ్ఛ, 2. అభిరుచులు మరియు అనుసరించే స్వేచ్ఛ లేదా మనిషి జీవితం కోసం తమ ప్రణాళిక చేసుకునే స్వేచ్ఛ, 3. ఇతరులకు ఇబ్బంది కలుగకుండా సాధారణ ప్రయోజనాలు కోసం ఒకే ఆలోచనతో ఉండే వాళ్ళు అంతా ఒకటిగా ఉండే స్వేచ్ఛ అని వివరించారు.

మిల్ ఇందులో భిన్నాభిప్రాయం అనేది కీలకమైనదని, ఎందుకంటే ఇది విజ్ఞానాన్ని సంరక్షిస్తుందని చెప్పారు మరియు వ్యక్తి అనవసర విషయాలను దాచిపెట్టడానికి మరియు విశదపరచడానికి స్వేచ్ఛ కలిగి ఉండాలని వివరించారు. మనుషులు భ్రమతో జీవిస్తుంటారు. అందువలన మనుగడ కోసం రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు; మనిషి సమాజ మరియు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుటకు భావాలను వ్యక్తపరిచే స్వేచ్ఛ తప్పక అవసరమని వివరించారు.

సామాజిక ఒప్పందం అను భావన ప్రకారం వ్యక్తులు సమాజంలో భాగం అయినప్పుడు లేదా గుర్తింపు పొందినప్పుడు వారి ఒప్పందం మేరకు వ్యక్తికి అవసరమైనప్పుడు రక్షణను పొందవచ్చును. ఈ భావనను మిల్ తిరస్కరించారు. మిల్ ఆలోచనలో వ్యక్తులు సమాజానికి తన భావనలు లేదా చర్చల ద్వారా హాని కలిగించనంతవరకు జవాబుదారులుకారని, ఒకవేళ జరిగితే ఆ వ్యక్తిని శిక్షించడం లేదా చర్య తీసుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని వివరించారు. ఈ పుస్తకం ద్వారా వ్యక్తి వికాసానికి మరియు సమాజ అభివృద్ధికి స్వేచ్ఛ అనేది చాలా అవసరమని, ముఖ్యంగా సమాజంకన్నా రాజ్యమే ముఖ్యమని వివరించారు. ఇలాంటి వ్యవహారాలు లేదా ఒప్పందాలు ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో మాత్రమే సాధ్యమగునని వివరించారు. పాలకులు మరియు ప్రతిపక్షం మధ్య వచ్చే బేధాలు మరియు పాలకుల పాలనపై సరైన శ్రద్ధ కలిగి ఉంటే పైవన్నీ సాధ్యమగునని వివరించారు. *

**లేటెస్ట్ పుస్తకం**

### సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్ త్రూ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్

రచయిత: జె సి కలిత



ఈ రచయిత గౌహతిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో గణిత శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

ఈ పుస్తకం ఒక సంస్థ క్రమబద్ధంగా స్థాపించుటకు కావలసిన వివిధ రకాలైన దశలను గురించి వివరిస్తుంది. దీనికి ప్రభుత్వ మరియు ప్రభుత్వ అనుబంధ సంస్థల కార్యకలాపాలు ఏవిధంగా ఉపయోగపడుతుంది అనే ఆలోచనలు వ్యవస్థాపకులకు ఒక క్రమబద్ధమైన వివరణ ద్వారా అందిస్తుంది. అంతేకాకుండా ఒక సంస్థ స్థాపన మరియు నిర్వహణతోపాటు ఆ సంస్థ నష్టపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనేది వివరిస్తుంది. ఇది ఎంటర్‌ప్రెన్యూర్లకు కావలసిన సామాజిక బాధ్యతల గురించి చాలా చక్కగా వివరిస్తుంది.

ఈ పుస్తకం సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్ ద్వారా ఉపాధి పొంది ఎంటర్‌ప్రెన్యూర్లుగా స్థిరపడడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. *

**లేటెస్ట్ పుస్తకం**

### ద రీ-ఎమెర్జింగ్ ఆఫ్ సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్

రచయిత: రిచర్డ్స్ ఆరుమ్ అండ్ వాల్టర్ ముల్లర్



కొంతమంది పరిశోధకులు 11 అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలో సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్‌పై చేసిన జాతీయ పరిశోధనా పథకం ఫలితమే ఈ పుస్తకం. ఈ సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్ పద్ధతిని ఆధునిక సమాజంలో ఎప్పుడు మరియు ఎలా వెలుగులోకి తీసుకురావాలనే విషయాన్ని దీనిలో వివరించారు. అయితే సాంప్రదాయ పద్ధతులలో ఉన్న చేతివృత్తులు మరియు చిన్న వ్యాపారాలు కుంటుపడిన, సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్ ద్వారా నైపుణ్యం కలిగిన లేదా నైపుణ్యం లేని వృత్తులను భర్తీ చేయొచ్చని ఈ పుస్తకం వివరిస్తుంది. ఎవరైనా సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్‌లో చేరుతున్నప్పుడు లేదా దానిలో కొనసాగినప్పుడు ఆ వ్యక్తి యొక్క సామాజిక పరిస్థితులు, విద్యానైపుణ్యాలు, చరిత్ర, కుటుంబ పరిస్థితులు మరియు లింగ వివక్షత ఎంతమేరకు సంభావ్యతను కలిగి ఉంటుందో ఈ పుస్తకం వివరిస్తుంది. ఈ మధ్యకాలంలో వ్యక్తులకు సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్ సర్వసాధారణమైంది. అలాగే సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్ లో చేపట్టే కార్యక్రమాలు, గతంలోకన్నా విభిన్నమైనవి, అస్థిరమైనవి మరియు తాత్కాలికమైనవి. ఇది ఔత్సాహికులకు ఉపయుక్తకరంగా ఉంటుంది. *

**ఈ-వనరులు**

| | | |
|---|---|---|
| విలువ గొలుసు | – | http://pdf.usaid.gov/pdf_docs/Pnads253.pdf |
| ఉపరంగం | – | http://www.cuts-citee.org/tdp/pdf/Case_Study-Fisheries_Sub_Sector_in_Tanzania.pdf |
| ఈ-పుస్తకం | – | http://nceuis.nic.in/The_Challenge_of_Employment_in_India_(Vol.%20II).pdf |
| వీడియో | – | https://www.youtube.com/watch?v=RbtPXRNFdrQ |

**అనుబంధాలు**

| | | |
|---|---|---|
| బృహత్ ప్రయత్నం | : | http://livelihoods.net.in/sites/default/files/pdf/jeevanopadhulu_organic_farming_-_sep_2016.pdf |
| క్షేత్రం | : | http://livelihoods.net.in/sites/default/files/pdf/jeevanopadhulu_kshetram_chota_nagpur_plateau_sep_2016.pdf |
| లైవ్లీహుడ్స్ మేనేజ్‌మెంట్ నోట్స్ | : | http://livelihoods.net.in/sites/default/files/pdf/supplement_livelihoods_management_note_september_2016.pdf |

**ఈ-కోర్సు**

**ఈ-లైవ్లీహుడ్స్ లెర్నింగ్ కోర్స్ : క్యాప్సుల్ నెం: 352 - 368**

http://livelihoods.net.in/sites/default/files/pdf/e-course_september_2016.pdf

## 'యోగ'క్షేమం

కృష్ణాష్టమి! కృష్ణం వందే జగద్గురుం! గణేశ్ చతుర్థి!
ఉపాధ్యాయ దినోత్సవం! బక్రీద్! ఇంజనీర్స్ డే!
ప్రముఖ్ స్వామి ఆత్మ శాంతించుగాక! కోల్‌కతా సెయింట్ థెరెసా!
ఈ నెలలో తెలుసుకున్న విషయాలు –
"ఎక్కువగా కలలు కను, ఎక్కువగా నేర్చుకో, ఎక్కువ పనులు చేయి, ఎక్కువగా మారు, ఇతరులు ఎక్కువగా కలలు కనేందుకు, ఎక్కువ నేర్చుకునేందుకు, ఎక్కువ పనులు చేసేందుకు, ఎక్కువగా మారేందుకు సహకరించు."
ఒకవేళ నేను పేదరిక నిర్మూలన రంగంలో మూడు అంశాలను ఎంపిక చేసుకోవాల్సి వచ్చేట్లయితే, అవి కమ్యూనిటైజేషన్, భవిష్య దర్శనము మరియు నాయకత్వం అయి ఉంటాయి.

**ఈ మూడింటి కేంద్ర బిందువుగా ఉండేది నాయకత్వం. నేర్చుకునే నాయకత్వం. ఇతరులపట్ల దయగా ఉండే నాయకత్వం. ప్రేమించే నాయకత్వం. నాయకులను నిర్మించడం. బృందాలను నిర్మించడం. వారసత్వం కోసం పని చేయడం. దార్శనికుడు. ఇతరులకు ప్రేరణ.సరిహద్దుల నిర్వహణ. సంబంధాల నిర్వహణ. భాగస్వామ్యాల నిర్వహణ. అధికార నిర్వహణ.**

స్టీవెన్ స్టోవెల్, స్టెఫానీ మీడ్ రచించిన **'ద ఆర్ట్ ఆఫ్ స్ట్రాటజిక్ లీడర్‌షిప్'**లో చెప్పినట్లుగా, ఇది ఈ క్రింది వాటితో ప్రారంభమవుతుంది –

* అనుచరులను అనుసరించడం; మన బృందాన్ని అర్థం చేసుకోవడం
* వర్తమానంతో కొనసాగుతూ, భవిష్యత్తు వైపు చూడడం
* తప్పనిసరిగా అవసరమైన వాటిపై దృష్టి కేంద్రీకరించి, బాధ్యతలను పంచడం, ఇతరులూ ముందుకెళ్లేలా చూడడం
* బాధ్యతలను తీసుకపోవడం మరియు ఇతరులు బాధ్యతలను తీసుకునేలా చూడటం
  ♦ మన ప్రయత్నాలను మొత్తంగా అర్థం చేసుకోవడం లేదా ఒక మొత్తంగా ఎలా పని చేస్తుందో అర్థ:ం చేసుకోవడం
  ♦ ఎంటర్‌ప్రెన్యువల్ స్ఫూర్తి
  ♦ ఫలితాల పట్ల జవాబుదారీతనం
  ♦ ఎక్కువగా గుర్తింపు లేని/గుర్తింపు పొందని అంశాల బాధ్యత తీసుకోవడం
  ♦ ఖర్చులు, ఫలితాలపై జవాబుదారీతనం
* దృఢంగా కనిపించడం.
  ♦ అలసట లేకుండా ప్రోత్సాహం, సత్తువ
  ♦ ఓటమిని అంగీకరించకపోవడం
  ♦ అవసరం లేని భాగాలను తొలగించడం, వేచి ఉండే వాటిని పక్కన బెట్టడం, బాధ్యతలను పంచడం, అత్యవసరమైన వాటిపై మాత్రం దృష్టి పెట్టడం
* తక్కువ ఆపదలు ఉన్న వాటిని చేపట్టడం
  ♦ ఆపదలను అర్థం చేసుకోవడం
  ♦ వాటి గురించి సమగ్ర సమాచారం తెలుసుకుని వాటితో వ్యవహరించడం – నివారించడం, తగ్గించడం, నష్టాన్ని తగ్గించడం, సర్దుకుపోవడం, అధిగమించడం
* సర్దుబాటు, సామర్థ్యంతో పని చేయడం
  ♦ వేగం (వేగంగా ఆలోచించడం, వేగవంతమైన చర్యలు)
  ♦ నైపుణ్యం (సామర్థ్యం)
  ♦ నేర్చుకున్నవి వేగంగా మర్చిపోవడం, త్వరగా నేర్చుకోవడం
  ♦ దీర్ఘకాలిక, స్వల్పకాలికాల మధ్య వేగంగా మారడం. వ్యూహాత్మకం నుంచి నిర్వహణ వైపు
  ♦ అనుకోని వాటి పట్ల ప్రతిస్పందన (నిలబడి ఆలోచించడం)
* పరిస్థితులకు, అవసరాలకు తగినట్లుగా మన పని విధానాన్ని మార్చుకోవడం
* కాలానుగుణంగా వచ్చే మార్పులను తెలుసుకోవడం (జాగరూకత)
  ♦ కాలంతో పాటు వచ్చే మార్పులను తెలుసుకోవడం, పునరాలోచించుకోవడం
  ♦ సమాచారం (లోపలి నుంచి, బయటి నుంచి)
  ♦ విశ్లేషణ, సమీక్ష, సమాచారంలో అర్థాలు/విధానాలు తెలుసుకోవడం
  ♦ పైవాటి మీద ఆధారపడిన చర్యలు
* మార్పు కోసం పరిశ్రమించడం
  ♦ మార్పు విషయంలో మన ప్రతిస్పందనలను అర్థం చేసుకోవడం – మార్పుకు వ్యతిరేకమా, మార్పును సహిస్తామా, మార్పును కోరుకుంటామా?
  ♦ మార్పుకు దారి తీసే వాటిని సమీకరించడం
  ♦ మార్పును ముందస్తుగా ఊహించడం, దాని కోసం సిద్ధంగా ఉండడం, లేదా/మరియు మనమే ఆ మార్పును తీసుకురావడం
* విజనింగ్
  ♦ అతి సాధారణ, సాధించదగ్గ, ఇతరులతో పంచుకోదగ్గ విజనింగ్
  ♦ లక్ష్యంపై దృష్టి
  ♦ అన్నింటిపైనా దృష్టి పెట్టే ప్రణాళికారచన
  ♦ నమ్మకం, విశ్వాసం, హామీ అంతటితో
* క్రమబద్ధమైన నిర్మాణం
  ♦ వాస్తవ పరిస్థితులపై ఆధారపడి నిర్మాణం
  ♦ మన ప్రదర్శనను మెరుగుపరచుకోవడం, లోటుపాట్లను సవరించుకోవడం, కొనసాగడం
  ♦ క్రమబద్ధీకరించడం, మెరుగైన అలవాట్లను పాటించడం, నిరంతరం మెరుగుపరచుకోవడానికి ప్రయత్నించడం
  ♦ పూర్తిస్థాయిలో ప్రక్షాళన, అనుబంధ, అదనపు కార్యకలాపాలు
  ♦ భవిష్యత్తు కోసం సిద్ధంగా ఉండడం
* సమగ్రత
* భవిష్యత్ తరాల కోసం ప్రణాళికలు రూపొందించుకోవడం

మనందరం కూడా నాయకులుగా జన్మించి ఉంటాం. మనం మనదైన శైలిలో నాయకత్వం వహిస్తుంటాం. ఏదైనా కళ తరహాలోనే, మనం దాని పట్ల స్పృహతో ఉంటే, ఓపికగా దానిపై దృష్టి పెడితే, దృఢమైన క్రమశిక్షణతో ఉంటే, 10వేలకు పైగా గంటల పాటు ప్రాక్టీస్ చేస్తే, మన నాయకత్వం మరింత ప్రభావశీలంగా మారుతుంది. మనం నాయకత్వంలోని కేంద్ర భాగం ప్రేమ. నాయకత్వం వహించడం కొరకు మరియు ఈ విశ్వం కొరకు ప్రేమ.

అప్పుడు మనం బాగా నేర్చుకుంటాం, బాగా అనుసరిస్తాం, బాగా చేస్తాం, బాగా ఆలోచిస్తాం, బాగా ఉంటాం. భవిష్యత్తును ఊహించి, అందుకోసం బాగా ప్రణాళికలు రూపొందించుకుంటాం. నాయకులను తయారు చేసుకుంటాం. అప్పుడు మనం మంచి నాయకులుగా, మంచి మధ్యవర్తులుగా, మంచి ఉపాధ్యాయులుగా, మంచి మార్గదర్శకులుగా, మంచి వృత్తి నిపుణులుగా తయారవుతాం. అప్పుడు మనం మంచి తల్లిదండ్రులుగా, మంచి అన్నాచెల్లెళ్లుగా, భాగస్వాములుగా, స్నేహితులుగా, సహచరులుగా తయారవుతాం. మనం మంచి మానవులం, కేవలం 'కలిగి ఉండే' మానవులం కాదు. మనం మానవులుగా ఉండేందుకు నిరంతరకృషి చేయాల్సిన అవసరం ఉంది.

మనం ప్రవాహంలో, పని చేయడంలో, వేడుకల్లో, జీవితాన్ని జీవించడంలో ముందుండాలి. సేవ చేసే, నాయకత్వం వహించే స్ఫూర్తి మనల్ని ప్రేమతో ఈ విశ్వం యొక్క ఒడిలోకి తీసుకోవాలి. అప్పుడే మనం ఈ విశ్వంలో ఐక్యం కాగలం. ఇదే లోకనాయకనాటకం. ఇదే లోకసంగ్రహయోగం.

మనం అక్కడికి చేరుకోగలమా? **ఆత్మయోగను అనుసరిస్తే అది సాధ్యమే.** మనం శ్రద్ధగా ఆలోచిస్తే. మనం పూర్తి స్పృహతో ఉంటే. మనం కాలంతో పాటు వచ్చే మార్పులకు అనుగుణంగా మారితే. భవిష్యత్తును ఊహించగలిగితే. ముందు ముందు ఏం జరుగుతుందో చూడగలిగితే! మనం ఆచరిస్తే! మనం ఒకే దానిపై దృష్టి పెడితే! మనలో క్రమశిక్షణ ఉంటే! మనం అందుకు సిద్ధంగా ఉంటే! మనం ఓటమిని అంగీకరించకుంటే! కృష్ణుడు మనల్ని తనలోకి చేర్చుకుంటానని స్పష్టంగా చెబుతాడు – ఆయన మనల్ని అందరినీ తన అవసరాల నిమిత్తం ఉపయోగించుకుంటాడు – అలా మనం సిద్ధంగా ఉన్నామని ఆయనకు తెలియజేస్తే.

మా యోగ ప్రపంచంలోకి రండి – ఈ విశ్వంలో ఐక్యమయ్యేందుకు, దాని పరమార్థం వైపుకు – **జగన్నాయకసఖ్యతాయోగసిద్ధి** వైపుకు. అందుకు మీరెన్నడూ చింతించరు.

**–జి. మురళీధర్** ✸

*Note: We are requesting our partners to take over bringing out 'livelihoods' in local languages, with effect from October 2016. As part of this policy, we will not be attempting to give 'Jeevanopadhulu' from October 2016 directly on our own. Kindly note.*

*Contact: laxman26@gmail.com; 9885499297*

అక్షర లైవ్లీహుడ్స్ ప్రైవేట్ లి॥ జీవనోపాధులు మరియు అభివృద్ధి రంగంలో 6 నెలల ఇంటర్న్‌షిప్‌ల కోసం ఆహ్వానిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు మీ CVలను పంపించగలరు.

ఈ మెయిల్: laxman26@gmail.com

aksharakriti@gmail.com, jeevanopadhulu@gmail.com